


చేనేతల కల సాకారం

- అట్టహాసంగా మెగా టెక్స్‌టైల్ పార్కు శంకుస్థాపన
- చేనేతలకు ఉపాధి కల్పించడమే లక్ష్యం : మంత్రి సవిత

ఎమ్మిగనూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా చేనేతలు ఎదురు చూస్తున్న మెగా టెక్స్‌టైల్ పార్కు కల ఎట్టకేలకు సాకారమైంది. ఎమ్మిగనూరు మండలం బనవాసిలో ఏర్పాటు చేయనున్న మెగా టెక్స్‌టైల్ పార్కుకు మంగళవారం రాష్ట్ర మంత్రులు సవిత, టీజీ భరత్, ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రావడంతో చేనేతలకు స్వర్ణయుగం వచ్చిందన్నారు. ప్రతి చేనేత కుటుంబానికి 365 రోజులు పని కల్పించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని అన్నారు. క్లస్టర్లు ఏర్పాటు చేసి చేనేత ఉత్పత్తులను గిట్టుబాటు ధరలకు విక్రయించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫ్రేమ్‌లూంను 90శాతం సబ్సిడీపై అందజేయడంతో పాటు యారన్‌తో పాటు మిగతా ముడి సరుకులను సొసైటీల ద్వారా సబ్సిడీ ధరలకు అందజేస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి సవిత

మిగతా 6వ పేజీలో



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు సవిత, టీజీ భరత్, ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

కేడీసీసీబీలో గ్రూపులు



ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో నాలుగు లక్షల మంది రైతులకు పంట, దీర్ఘకాలిక రుణాలు అందిస్తూ వాణిజ్య బ్యాంకులతో పోటీపడేది కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(కేడీసీసీబీ). వీటి పరిధిలోని 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో సభ్యులుగా ఉన్న రైతులు పంట సాగుకోసం ఆధారపడుతున్నారు. ప్రస్తుతం బ్యాంకు పాలన గాడి తప్పుతుండటంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. కేడీసీసీబీలో రెండు గ్రూపులు ఏర్పడి సీఈవో పోస్టు కోసం ఒకరిపై ఒకరు ఆప్కాబ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసుకుంటూనే ఉన్నారు. ప్రస్తుతం సంవత్సరకాలంగా ఆప్కాబ్ చెందిన ఉన్నతాధికారి విజయకుమార్ తాత్కాలిక సీఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పాలనను గాడిన పెట్టేందుకు ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు.



- గాడి తప్పుతున్న పాలన
- సీఈవో పోస్టు కోసం పోటాపోటీ
- ఒకరిపై మరొకరు ఆప్కాబ్‌కు ఫిర్యాదులు
- రాజకీయ నాయకుల వద్ద ఓవర్గం పైరవీలు
- మరోవర్గం ఆప్కాబ్ ఉన్నతాధికారుల వద్ద లాబీయింగ్

కర్నూలు అగ్రికల్చర్, మే 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(కేడీసీసీబీ)లో పాలన గాడి తప్పుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో నాలుగు లక్షల మంది రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు అందిస్తూ వాణిజ్య బ్యాంకులతో పోటీపడేది. ప్రస్తుతం బ్యాంకు పాలన గాడి తప్పుతుండటంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బ్యాంకులో రెండు గ్రూపులు పోటాపోటీగా తమ ఎదుటివారిపై ఫిర్యాదులు ప్రధాన కార్యాలయం ఆప్కాబ్‌కు పంపిస్తున్నారు. ఈ బ్యాంకు సీఈవో పోస్టును దక్కించుకునేందుకు దరఖాస్తు చేసుకున్న కొంతమంది పెద్దఎత్తున రాజకీయ నాయకుల వద్ద పైరవీలు చేస్తున్నారు. మరో వర్గం ఉన్నతాధికారుల వద్ద లాబీయింగ్ కొనసాగిస్తోంది. గతంలో ఖాళీ అయిన ఈపోస్టును దక్కించుకునేందుకు ఆప్కాబ్ సంస్థ హైదరాబాదుకు చెందిన ఒక రిటైర్డు అధికారిని ఎంపిక చేసింది. ఆ అధికారి గతంలో పనిచేస్తున్న బ్యాంకు నుంచి నోఅబ్జక్షన్ సర్టిఫికెట్(ఎన్ఓసీ) తీసుకురావడంలో జాప్యం చేయడంతో ఆపోస్టు భర్తీ కాలేదు. ప్రస్తుతం సంవత్సరకాలంగా ఆప్కాబ్ చెందిన ఉన్నతాధికారి విజయకుమార్ తాత్కాలిక సీఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఇన్‌చార్జి సీఈవో సతమతం

కేడీసీసీబీలో ఇటీవల కాలంలో రెండు గ్రూపులు ఒకరిపై ఒకరు ఆప్కాబ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసుకుంటూనే ఉన్నారు. గతంలో వారు ఎక్కడెక్కడ ఏయే కార్యక్రమాల్లో తలదూర్చి అక్రమాలకు పాల్పడ్డారో వివరాలను ఆకాశరామన్న పేరుతో ఆప్కాబ్ ఉన్నతాధికారులకు లెటర్లు రాస్తూనే ఉన్నారు. మరో ముందడుగు వేసి కొంతమంది అధికారులు, యూనియన్ నాయకులు రాజకీయ నాయకుల వద్ద పైరవీలు చేస్తున్నారు. ఫలానా వారు సీఈవో పోస్టులో ఉంటే బ్యాంకు ప్రతిష్ఠ ఏవిధంగా ఉంటుందో పూస గుచ్చినట్లు చెప్పడమే కాకుండా, ఏ అధికారి ఏవిధంగా రుణాల మంజూరులో అక్రమాలకు పాల్పడ్డారో వివరిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. రెండు గ్రూపులకు చెందిన అధికారులను ఏవిధంగా కట్టడి చేయాలో ఇన్‌చార్జి సీఈవో సతమతమవుతున్నారని బ్యాంకు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా ఆప్కాబ్ సీఈవో పోస్టుకు నోటిఫికేషన్ జారీ చేసి రెగ్యులర్ సీఈవోను నియమిస్తే తాను పక్కకు తప్పుకునేందుకు మార్గం సుగమవుతుందని ఇన్‌చార్జి సీఈవో తన ప్రయత్నాలు తాను చేస్తున్నట్లు తెలిసింది.

రాజకీయ నాయకులకు కలిసొచ్చింది

కేడీసీసీబీలో అధికారులు, సిబ్బంది రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేయడంతో పాటు ఆ అధికారుల కార్యకలాపాలను పూస గుచ్చినట్లు వివరిస్తుండటంతో రాజకీయ నాయకులు చంకలు గుద్దుకుంటున్నారు. తమతో పాటు తమ అనుచరులకు చెప్పినవారికి నిబంధనలు అతిక్రమించైనా త్వరితగతిన రుణాలివ్వాలని, ఇదే అదునుగా వారు అధికారులపై సహకార సంఘాల్లోని సీఈవోలపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. జూన్ నుంచి మొదలయ్యే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పెద్దఎత్తున పంట రుణాలను ఇచ్చే అవకాశముంది. ఈ పంట రుణాలను తమతో పాటు తాము సిఫారసు చేసిన వారికి మంజూరు చేయించుకునేందుకు బ్యాంకులో నెలకొన్న గ్రూపు తగాదాలు తమకు కలిసొచ్చిన అదృష్టంగా నాయకులు భావిస్తున్నారు.

అభివృద్ధికి ఆటంకం కలిగిస్తే చర్యలు



కర్నూలు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అభివృద్ధి పథంలో నడుస్తోంది. వాణిజ్య బ్యాంకులకు పోటీగా రైతులకు, ఇతర వర్గాల వారికి ఆర్థిక సహకారం అందిస్తున్నాం. ఇటీవల బ్యాంకులో పనిచేస్తున్న కొంత మంది ఆప్కాబ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. బ్యాంకు విధులకు, అభివృద్ధికి ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవు. గతంలో మాదిరిగానే జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో అన్ని కార్యక్రమాలు యథావిధిగా సాగుతాయి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- విజయకుమార్, ఇన్‌చార్జి సీఈవో, కర్నూలు

ప్రజాభీష్టం మేరకే పరిశ్రమలు

- ఆర్డీవో సందీప్‌కుమార్
- ప్రాచీన లిపిలు, పొలాలు పరిశ్రమ యాజమాన్యం కాపాడాలి
- కేతవరం సర్పంచ్ గోవర్ధన్
- కన్నమడకల గ్రామ సమీపాన ప్రజాభిప్రాయ సేకరణ

ఓర్వకల్లు, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, రైతుల అభీష్టం మేరకే పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కన్నమడకల గ్రామ సమీపాన ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, కాలుష్య నియంత్రణ ఈఈ కిషోర్‌రెడ్డి హాజరయ్యారు. అభిషేక్ మినరల్స్ సిలికా సాండ్ వాట్‌జైట్ గని నిమిత్తం కేతవరం గ్రామ సర్వే.నెంబరు 288పీలో క్వారీ లీజు నిమిత్తం 20.242 హెక్టార్లలో సిలికా సాండ్ వాట్‌జైట్‌ను అనుమతులు ఇవ్వాలని దరఖాస్తు చేసుకోగా.. ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. కేతవరం గ్రామంలో సిలికా సాండ్ ఉండగా.. కన్నమడకల గ్రామ సమీపాన ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కేతవరం గ్రామంలో సిలికా సాండ్‌కు లీజుకు దరఖాస్తు చేసుకోగా అక్కడ ఏర్పాటు చేస్తే దుమ్ము ధూళి తమ పొలాల్లో పడుతుందని, అలాగే ప్రజలు రోగాల బారిన పడి ఆసుపత్రుల పాలు కావాల్సి వస్తుందని కన్నమడకల గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ పరిశ్రమ వద్దంటూ అధికారులను నిలదీశారు. కేతవరం సర్పంచ్ గోవర్ధన్ మాట్లాడుతూ తమ గ్రామ సర్వే.నెంబర్. 288పీలో సిలికా సాండ్‌కు దరఖాస్తు చేసుకున్నారని, గ్రామ సమీపాన పురాతన ప్రాచీన లిపిలు ఉన్నాయని వాటికి, పొలాలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత పరిశ్రమ యాజమాన్యంపై ఉందన్నారు. సీపీఎం నాయకుడు రామకృష్ణ మాట్లాడుతూ గతంలో పరిశ్రమల యజమానులు ప్రజాభిప్రాయ సేకరణలో చెప్పినవన్నీ ఏఒక్క పరిశ్రమ యాజమాన్యం చేపట్టలేదని, అయితే ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన మెజార్టీ ప్రకారం పరిశ్రమను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మండలంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం.. స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పి పరిశ్రమలు ఏర్పాటయ్యాక స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకుండా స్థానికేతరులకు ఉద్యోగాలు కల్పిస్తున్నారని ప్రజలు మండిపడ్డారు. తహసీల్దార్ విద్యాసాగర్, ఎస్ఐ సునీల్‌కుమార్, కన్నమడకల సర్పంచ్ పెద్దకాశీం, సీపీఎం నాయకుడు నాగన్న, గ్రామస్థులు పాల్గొన్నారు.



కన్నమడకల ప్రజా వేదికలో మాట్లాడుతున్న ఆర్డీవో సందీప్‌కుమార్

పరిశ్రమ వద్దే వద్దు



సిలికాన్ సాండ్ పరిశ్రమ వద్దే వద్దు. కేతవరం సమీపంలో ఏర్పాటుచేసినా ఆ దుమ్ము ధూళి తమ పొలాలపై పడుతుంది. పంటలు నష్టపోవాల్సి వస్తుంది. ఈ పరిశ్రమతో గ్రామస్థులు రోగాలబారిన పడే ప్రమాదం ఉంది.

- తిక్కలి వెంకటేశ్వర్లు, కన్నమడకల

గ్రామస్థులను చంపి పరిశ్రమ ఏర్పాటు చేసుకోండి



కేతవరంలో నిర్మిస్తున్న సిలికాన్ పరిశ్రమ దెబ్బతో కన్నమడకల గ్రామస్థులకు చాలా ఇబ్బందులు వస్తాయి. గ్రామస్థులను చంపి పరిశ్రమను ఏర్పాటు చేసుకోండి. ఇప్పటికే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పంట దిగుబడి కూడా రావడం లేదు.

- ఫక్కీరమ్మ, మహిళా రైతు, కన్నమడకల

బిల్లుల కోసం ఎదురుచూపు

ఇప్పటి వరకు విడుదలైన బిల్లులు రూ.23.75 కోట్లు

6



జీఎస్టీ వసూళ్లలో కర్నూలు టాప్

- ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.99.55 కోట్ల రాబడి
- వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సుధాకర్‌రావు

కర్నూలు న్యూసిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇతర జిల్లాల కంటే కర్నూలు జిల్లా జీఎస్టీ వసూళ్లు అత్యధికంగా జరిగినట్లు వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సుధాకర్‌రావు తెలిపారు. మంగళవారం కర్నూలు నగరంలోని గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది ఏప్రిల్‌లో రూ.89.404 కోట్లు జీఎస్టీ రాగా, ఈ సంవత్సరం ఏప్రిల్‌లో రూ.99.55 కోట్లు జీఎస్టీ వసూళ్లు అయిందన్నారు. ఈమేరకు 12 శాతం పెరుగుదల కనిపించిందన్నారు. జిల్లాలో గ్రీన్‌ఎనర్జీ, సోలార్ ఎనర్జీ, మైనింగ్ తదితర కార్యకలాపాల వల్లనే ఇది సాధ్యమైందన్నారు. ఆన్‌లైన్ జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకోవడంలో అక్రమాలు జరుగుతున్నాయని, వాటిని గమనించి నాలుగు నెలల నుంచి నేరుగా కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకునే విధానాన్ని ప్రవేశపెట్టామని ఆయన తెలిపారు. ఈ మేరకు ప్రతి నెల 200కు పైగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్నారు. గతంలో నేరుగా తనిఖీలు చేపట్లేవారమని, ప్రస్తుతం రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తేనే తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. జీఎస్టీ చెల్లించకుండా అక్రమంగా వస్తువులను రవాణాచేసే వాహనాలను పట్టుకుని సీజ్ చేస్తామన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో వస్తువులను స్వాధీనం చేసుకుని పంపుతామన్నారు. అనంతరం ఆ వస్తువులను వేలం వేస్తామన్నారు. ఇటీవల ఆదోనిలో స్థానిక పోలీసులతో కలిసి ఓ బంగారు వ్యాపారి వద్ద అక్రమ బంగారాన్ని గుర్తించి రూ.9లక్షలు జరిమానా విధించామన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ సుధాకర్‌రావు

ప్రచండ భానుడు

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- అల్లాడిపోతున్న ప్రజలు
- నిర్మానుష్యంగా రోడ్లు
- బండిఆత్మకూరులో 42.2 డిగ్రీల సెల్సియస్ నమోదు



నిర్మానుష్యంగా నూనెపల్లె రోడ్

నంద్యాల ఎడ్యుకేషన్, మే 6 (ఆంధ్రజ్యోతి): భానుడు ఉగ్రరూపం దాల్చాడు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. దీంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. జనాలు రోడ్లపై వచ్చేందుకు జంకుతుండటంతో రోడ్లన్నీ మధ్యాహ్నం ఒంటి గంట లోపే నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మంగళవారం ఉష్ణోగ్రత అత్యధికంగా నమోదయ్యాయి. నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలంలో 42.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. గోస్పాడు 42.14, బనగానపల్లె 41.96, సంజామల 41.91, దొర్నిపాడు 41.67, కోవెలకుంట్ల 41.48, పాణ్యం 41.09, జూపాడుబంగ్లా 40.98, రుద్రవరం 40.89, ఆళ్లగడ్డ 40.87, చాగలమర్రి 40.67, శిరివెళ్ల 40.35, కొత్తపల్లె 40.35, గడివేముల 40.2, మహానంది 40.07, పాములపాడు 40.0, నందికొట్కూరు 39.75 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణసంస్థ వెల్లడించింది.

కర్నూలు జిల్లాలో..

మంత్రాలయంలో 41.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. కోసిగి 41.4, కోడుమూరు 41.0, కౌతాళం 40.9, నందవరం 40.29, హొళగుంద 39.9, సి.బెళగల్ 39.9, వెల్దుర్తి 39.86, ఏర్వకల్ 39.79, క్రిష్ణగిరి 39.79, పెద్దకడబూరు 39.72, ఆదోని 39.7, ఎమ్మిగనూరు 39.5, చిప్పగిరి 39.5, కోసిగి 39.2, ఆలూరు 38.7, కర్నూలునగరం 38.67 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ సంస్థ వెల్లడించింది.

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయండి

- లోపాలను ఉపాధ్యాయులు సరిదిద్దాలి
- డీఈవో శామ్యూల్ పాల్



మాట్లాడుతున్న డీఈవో శామ్యూల్ పాల్

ఆదోని అగ్రికల్చర్, మే 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషిచేయాలని డీఈవో శామ్యూల్ పాల్ పేర్కొన్నారు. మంగళవారం సెయింట్‌జోసెఫ్ ఉన్నత పాఠశాలలో ఆదోని డివిజన్‌లోని పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల రెమిడియల్ తరగతులపై ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంచి నైపుణ్యత కలిగిన సబ్జెక్టు టీచరులు ఉన్నా పదో తరగతి ఫలితాలలో రాష్ట్రంలోని చివరి రెండోస్థానంలో ఉండడం ఆవేదనకు గురి చేసిందన్నారు. ఈలోపాలను సరిదిద్దుకొని సప్లిమెంటరీ పరీక్షల్లో కనీస మార్కులతో ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం ప్రభుత్వం సూచించిన విధంగా వీలైన విద్యార్థుల కోసం రెమిడియల్ తరగతులను నిర్వహించాలన్నారు. ఫెయిల్ అయిన పదివేల మంది విద్యార్థులను సప్లమెంటరీలో గట్టెక్కించాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడుపై ఉందన్నారు. కలెక్టర్ 40 శాతం ఉత్తీర్ణత సాధించలేని సబ్జెక్టు ఉపాధ్యాయులకు నోటీసులు జారీచేయాలని సూచించారన్నారు. కొన్ని ప్రైవేటు సంస్థలు ప్రభుత్వ పాఠశాలను తమకు అప్పగిస్తే వంద శాతం ఉత్తీర్ణత సాధించి చూపిస్తామని అడుగుతున్నారని, దీనిపై తమతో సమాధానం లేదన్నారు ప్రభుత్వం రూ.25కోట్ల జీతాలు చెల్లిస్తుందని, అది గుర్తించి పనిచేయాలని చురకలు అంటించారు. డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి, ఎంఈవో శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఆదిమూర్తి, సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

బిల్లుల కోసం ఎదురుచూపు

- ఉమ్మడి జిల్లాలో రూ.150.04 కోట్లతో 1,916 పనులు
- కర్నూలు జిల్లాలో వందశాతం, నంద్యాల జిల్లాలో 98.80 శాతం పనులు పూర్తి
- ఇప్పటి వరకు విడుదలైన బిల్లులు రూ.23.75 కోట్లు
- పెండింగ్‌లో రూ.126.29 కోట్లు
- ఇబ్బందుల్లో కాంట్రాక్టర్లు



కర్నూలు న్యూసిటీ, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటైన నాలుగు నెలలకు పల్లెల్లో అంతర్గత రోడ్లు (సీసీ రోడ్లు) నిర్మించాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ పనులు మంజూరు చేశారు. పల్లె పండుగ వారోత్సవాలంటూ గత సంవత్సరం అక్టోబరు 14 నుంచి 20వ తేదీ వరకు పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల పనులకు భూమి పూజ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కువ శాతం మంది వైసీపీ మద్దతుదారులైన సర్పంచులు ఉన్నారు. అయితే కూటమి నేతలు ఇష్టానుసారంగా రోడ్లను మంజూరు చేయించుకున్నారు. చేసిన పనులకు చేసినట్లుగా బిల్లులు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ కూడా ఇచ్చింది. అన్ని పనులను సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పనులు పూర్తి అయినా నేటికీ బిల్లులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టులు దక్కించుకున్న చిన్న, పెద్ద కూటమి నేతలు తీవ్ర ఇబ్బందుల్లో ఉండిపోయారు. గ్రామాల్లో అప్పులు చేసి పనులు పూర్తి చేసిన వారు నేడు చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక దిక్కులు చూస్తున్నారు.

రూ.150.04 కోట్లతో 1,916 పనులు

పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.150.04 కోట్లతో మొత్తం 1916 పనుల్లో భాగంగా 270.25 కిలోమీటర్ల మేర గ్రామాల్లో సీసీ రోడ్లు వేయాలని పనులు చేపట్టారు. ఈ పనుల్లో ఇప్పటి వరకు 268.51 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేసినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. కర్నూలు జిల్లాలో వంద శాతం, నంద్యాల జిల్లాలో 98.84 శాతం పనులు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు రూ.23.75 కోట్లు విడుదల అయ్యాయి. ఇంకా ఐదు నెలల నుంచి రూ.126.29 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. పనులను సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేయాలని నిర్దిష్ట గడువును కూడా విధించిన నేపథ్యంలో పల్లెల్లో కూటమి పార్టీలకు చెందిన నేతలు హడావుడిగా పనులు పూర్తి చేశారు. నిన్న మొన్నటి వరకు గత ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని ఆరోపణలు చేసిన కూటమి నేతలు ప్రస్తుతం తమ ప్రభుత్వంలో బిల్లుల విడుదలపై నెలకొన్న జాప్యంపై ప్రశ్నించే స్థితిలో కనపడటం లేదు. చేసిన పనులకు చేసినట్లుగా ఎం.బుక్ రికార్డు చేసి బిల్లులను అప్‌లోడ్ చేసిన రెండు, మూడు రోజులకు బిల్లులు పడిపోతాయని చెప్పిన దానికి ప్రస్తుత పరిస్థితికి పొంతన లేకుండా పోయింది.

తనిఖీలు అంతంతమాత్రంగానే..

ప్రభుత్వ ఆదేశాల మేరకు వేగంగా చేసిన పనులకు చేసినట్లుగా బిల్లులు విడదల కాకపోవడం వల్ల పలు ప్రాంతాల్లో చేసి పనులకు సంబంధించిన క్వాలిటీపై కూడా దృష్టి సారించనట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వేగంగా సీసీ రోడ్లు వేయడం..క్యూరింగ్ కూడా సరిగ్గా చేయనట్లు తెలుస్తోంది. రోడ్ల నాణ్యతపై పీఆర్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఇంజనీరు కూడా అధిక రోడ్ల పనులు జరుగుతున్న నేపథ్యంలో సమయం తక్కువగా ఉండటంతో ఆయా పనుల పట్ల పూర్తి స్థాయిలో ఆ వైపు తనిఖీలు చేపట్టలేదని వినిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1916 పనుల్లో ఇప్పటి వరకు 50 శాతం పనులకు కూడా క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్లు తనిఖీ చేయకపోవడం గమనార్హం. నాణ్యత పరిశీలించిన పనుల్లో కూడా సుమారు 50 నుంచి 60 శాతం పనుల్లో రికవరీకి ఆదేశించినట్లు సమాచారం. అయితే పూర్తయిన పనులకు వంద శాతం బిల్లులు చెల్లింపులు జరగలేదు. మొత్తం బిల్లుల్లో 15 శాతాన్ని డిపాజిట్‌గా ఉంచుకుని, క్వాలిటీ చెక్ చేసిన అనంతరం డిపాజిట్‌గా ఉంచుకున్న మొత్తాన్ని విడుదల చేస్తారని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.



త్వరలోనే బిల్లులు విడుదలయ్యే అవకాశం ఉంది

ఉపాధి హామీ పథకం నిధులతో చేసిట్టిన పనులకు త్వరలోనే బిల్లులు విడుదల అయ్యే అవకాశం ఉంది. ఉపాధి పనులకు సంబంధించి మెటీరియల్ కాంపోనెంట్ కింద కొంత శాతం నిధులు విడుదల అయ్యాయి. ఈ క్రమంలోనే పల్లె పండుగ కార్యక్రమంలో చేపట్టిన సీసీ రోడ్లు, ఇతరత్రా పనులకు బిల్లులు విడుదల కానున్నాయి. చేసిన పనులకు చేసినట్లుగా బిల్లులను అప్‌లోడు చేస్తున్నారు.

- వి.రామచంద్రారెడ్డి, పీఆర్ ఎస్ఈ, కర్నూలు

బీటీ రోడ్ల పరిస్థితి అంతే..

సీసీ రోడ్ల దారిలోనే బీటీ రోడ్డుకు సంబంధించి బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. కర్నూలు జిల్లాలో 4, నంద్యాల జిల్లాలో 3 పనులు మంజూరు చేశారు. ఉమ్మడి జిల్లాలో రూ.13.30 కోట్లతో 14.89 కిలోమీటర్ల మేర బీటీ రోడ్లను వేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 3.50 కిలోమీటర్లు మాత్రమే వేశారు. ఈ పనులకు కూడా ఇప్పటి వరకు ఒక్కపైసా కూడా విడుదల కాని పరిస్థితి నెలకొంది.



ఫెన్సింగ్ క్రీడ ఆడుతున్న దృశ్యం (ఫైల్)

దేశానికే ఆదర్శం రాష్ట్ర క్రీడా పాలసీ

- నిరుద్యోగులకు వరం స్పోర్ట్స్ కోటా
- ప్రతిభగల క్రీడాకారులకు సదవకాశం

నంద్యాల హాస్పిటల్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన క్రీడా పాలసీ దేశానికే ఆదర్శం. ఏ రాష్ట్రంలో లేని విధంగా క్రీడాకోటా 3శాతానికి పెంచి ఆదర్శంగా నిలిచింది. దేశంలో అన్ని రాష్ట్రాలు 2శాతం స్పోర్ట్స్ కోటా అమలు చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం 2నుంచి 3శాతానికి క్రీడా కోటాను పెంచింది. అంతేకాకుండా అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలు ఎలాంటి పోటీ పరీక్ష లేకుండా ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఐదుగురు కమిటీ సభ్యులను ఏర్పాటు చేసి క్రీడాకారుల సర్టిఫికెట్లు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పరిశీలించి ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించింది. కమిటీ సిఫార్సుల మేరకు ఏపీపీఎస్సీ ఆయా విభాగాల్లో ఉద్యోగాలు కేటాయించనుంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న డీఎస్సీలో కూడా 3శాతం కోటాను అమలు చేయడం విశేషం. దీంతో నిరుద్యోగులకు స్పోర్ట్స్ కోటా వరంగా మారింది. ఆటలు అన్నం పెడతాయా అన్న నానుడి పక్కకుపోయినట్లు కనిపిస్తోంది. ఎంచుకున్న క్రీడలో కఠోర సాధన చేస్తే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలిగే సత్తా ఉన్న క్రీడాకారులకు జీవితంలో ఉద్యోగం సంపాదించి స్థిరపడే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. కాగా 65 క్రీడా అంశాల్లో ఏ, బీ కేటగిరీలుగా చేయడంపట్ల కొంతమంది క్రీడాకారులు, క్రీడా సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఎ-కేటగిరీలో పూర్తయిన తర్వాతనే బి-కేటగిరి క్రీడాకారులకు అవకాశం ఇవ్వనున్నారు.

ఎ-కేటగిరి క్రీడాంశాలు ఇవే

ఆక్వాటిక్స్, అథ్లెటిక్స్, ఆర్చరీ, బాడ్మింటన్, బాల్ బాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, బేస్‌బాల్, చెస్, సైక్లింగ్, ఫుట్‌బాల్, ఫెన్సింగ్, గోల్ఫ్, జిమ్నాస్టిక్స్, హాకీ, హ్యాండ్‌బాల్, జూడో, కయాకింగ్ అండ్ కెనోయింగ్, కబడ్డీ, ఖోఖో, మోడ్రన్ పెంటాతలిన్, రోయింగ్, రోలర్‌స్కేటింగ్, రగ్బీ, షూటింగ్, సాఫ్ట్‌బాల్, స్క్వాష్, ట్రయాతలన్, టెన్నిస్, తైక్వాండో, టేబుల్ టెన్నిస్, వాలీబాల్ అండ్ బీచ్‌వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్, సెయిలింగ్.

కేటగిరి-బీ క్రీడాంశాలు

ఆక్యాపాట్యా, బిలియర్డ్స్ అండ్ స్నూకర్స్, బాడీబిల్డింగ్, బ్రిడ్జ్, క్యారమ్స్, సైకిల్ పోలో, ఐస్‌హాకీ, ఐస్ స్కేటింగ్, ఐస్ స్కీయింగ్, కరాటే, మాల్కంబ్, మోటార్‌స్పోర్ట్స్, నెట్‌బాల్, పెన్‌కాక్‌సిలత్, పోలో, పవర్‌లిఫ్టింగ్, షూటింగ్‌బాల్, రోల్‌బాల్, సెపక్‌తక్రా, సాఫ్ట్ టెన్నిస్, టెన్నికాయిట్, టెన్నిస్‌బాల్ క్రికెట్, టెన్‌పిన్‌బౌలింగ్, టగ్‌ఆఫ్‌వార్, ఉషూ, యాచింగ్, యోగాసన, డెఫ్‌స్పోర్ట్స్ క్రికెట్ మొదలైనవి బీ క్రీడాంశాలు.

క్రీడలన్నింటినీ సమానంగా చూడాలి



క్రీడా పాలసీలో ఏ, బీ కేటగిరీలు చేయడం సరి కాదు. ఎంతో కష్టపడితేకానీ అంతర్జాతీయ స్థాయికి ఎదగలేం. 2024సెప్టెంబరు 20నుంచి 24వరకు చైనాలో జరిగిన ఏషియన్ బీచ్ సెపక్‌తక్రా చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించా. ఈ చాంపియన్‌షిప్‌లో రెగూ విభాగంలో బ్రాంజ్ మెడల్ వచ్చింది. బీఎస్సీ పూర్తిచేశా. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం వస్తుందనే ఆశాతో ఉన్నాను.

- మధు, అంతర్జాతీయ బ్రాంజ్ మెడలిస్ట్, ఆలూరు

క్రీడాకారులకు మంచి అవకాశం



ప్రతిభా వంతులైన క్రీడాకారులకు ఇది మంచి అవకాశం. క్రీడల్లో అత్యున్నతస్థాయికి వెళితే ఉద్యోగం ఖాయం. ప్రభుత్వ క్రీడా పాలసీ క్రీడలకు ప్రోత్సాహ కరంగా ఉంది. తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లో ప్రోత్సహిస్తారు. ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయంతో క్రీడలకు మంచి గుర్తింపురానుంది.

- ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు, ఏపీ పీఈటీ ఎస్ఏపీఈ

క్రీడలపై ఆసక్తి పెరుగుతుంది



రాబోయే రోజుల్లో క్రీడలకు మరింత ఆసక్తిపెరిగే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల క్రీడాకారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఫెన్సింగ్ క్రీడలో జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు. స్పోర్ట్స్ కోటాలో ఫెన్సింగ్ క్రీడాకారులకు ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. నూతన స్పోర్ట్స్ పాలసీ అమలులో శాప్ చైర్మన్ భాగస్వాములు కావడం సంతోషం.

- లక్ష్మణ్, ఫెన్సింగ్ కోచ్, డీఎస్ఏ నంద్యాల.

డీఎస్సీలో ఉద్యోగమే లక్ష్యం



ప్రస్తుతం జరగబోయే డీఎస్సీలో ఉద్యోగమే లక్ష్యంగా సాధన చేస్తున్నా. డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా అమలు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. 2023లో కోయంబత్తూరులో జరిగిన పారా ఫెన్సింగ్‌లో జాతీయ స్థాయి బ్రాంజ్ మెడల్ సాధించా. డీఈడీ పూర్తిచేసి డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నా.

- ప్రసన్న, జాతీయ ఫెన్సింగ్ బ్రాంజ్ మెడలిస్ట్, నంద్యాల

వివాదంలో కేఎంసీ క్యాంటీన్

- తమకు అప్పగించాలంటున్న ఏపీజీడీఏ
- ఆ సంఘమే లేదన్న క్యాంటీన్ నిర్వాహకులు
- ఇబ్బందుల్లో వైద్య విద్యార్థులు, వైద్యులు



క్యాంటీన్ సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీజీడీఏ నాయకులు

కర్నూలు హాస్పిటల్, మే 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ(కేఎంసీ)లో క్యాంటీన్ వివాదం నెలకొంది. అక్కడి పనిచేసే వైద్యులు, జూనియర్ డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది, నర్సులు, ఉద్యోగులకు అల్పాహారం, భోజనం అందించే క్యాంటీన్ వివాదంలో చిక్కుకుంది. క్యాంటీన్‌ను తమకు అప్పగించాలని, పదవీ విరమణ పొందిన వారి పెత్తనం ఏమిటని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ) కేఎంసీ యూనిట్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు డా.పి.బ్రహ్మాజీ మాస్టర్, డా.ఎస్.సోమన్న ప్రశ్నిస్తున్నారు. మరో వైపు క్యాంటీన్ నిర్వాహకులు డా.వరప్రసాద్ అసలు ఏపీజీడీఏ అసోసియేషన్ అనేది లేదని, ఇప్పుడు ఉన్నవారు గ్రూపుగా తయారయ్యారని అంటున్నారు. దీంతో క్యాంటీన్ మాదంటే మాది అని వివాదం నెలకొంది. మంగళవారం ఉదయం ఏపీజీడీఏ నాయకులు క్యాంటీన్‌ను సందర్శించారు. మరో పక్క మధ్యాహ్నం 3.50గంటలకు డా.వరప్రసాద్ దీనికి కౌంటర్‌గా ప్రెస్‌మీట్ పెట్టారు. దీంతో వైద్యవిద్యార్థులు, వైద్యులు క్యాంటీన్ లేక అవస్థలు పడుతున్నారు.

48 గంటల్లో ఖాళీ చేయాలి



క్యాంటీన్‌ను 48 గంటల్లో ఖాళీచేసి ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘానికి అప్పగించాలని వారు క్యాంటీన్ సిబ్బందికి ఆ సంఘం అధ్యక్షుడు డా.పి.బ్రహ్మజీ మాస్టర్, ఉపాధ్యక్షుడు డా.సోమప్ప అల్టిమేటం జారీచేశారు. ఈక్యాంటీన్ కాలేజీ ఆవరణలో ఉందని, ఏపీజీడీఏ అసోసియేషన్ క్యాంటీన్‌ను డా.వరప్రసాద్‌కు ఐదేళ్ల మాత్రమే లీజ్‌కు ఇచ్చామన్నారు. క్యాంటీన్ అగ్రిమెంటు 30 ఏళ్లు ఉంటే ఆపత్రాలు చూపించాలన్నారు. 2024లో మూసివున్న క్యాంటీన్‌ను తమకు తెలియకుండా ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. ఇది అన్యాయమన్నారు. గత 15 నెలలుగా క్యాంటీన్ లేక ఇబ్బంది పడుతున్నామని, మా క్యాంటీన్‌ను అప్పగిస్తే సౌకర్యాలు కల్పించుకుని అందరికీ ఉపయోగంలోకి తెస్తామన్నారు. ఏపీజీడీఏకు నిబంధనల మేరకు ఎన్నికలు జరిగాయన్నారు.

విభజన తర్వాత అసోసియేషన్ లేదు

రాష్ట్ర విభజన తర్వాత ఏపీజీడీఏ అసోసియేషన్ అనేది లేదని, ఇప్పుడు ఉండేవారు గ్రూపుగా తయారై డబ్బులు కోసం పని చేస్తున్నారని క్యాంటీన్ నిర్వాహకులు డా.వరప్రసాద్ ఆరోపించారు. మంగళవారం క్యాంటీన్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. క్యాంటీన్‌ను అప్పగించాలని అంటున్న వైద్యులు తనను ప్రశ్నించే హక్కు లేదన్నారు. 30 సంవత్సరాల అగ్రిమెంటు ఉందా లేదా అనేది కోర్టులో తేలుతుందన్నారు. అనంతపురం మెడికల్ కాలేజీలో తాను పని చేస్తున్నానని, లాంగ్ లీవ్‌లో ఉన్నాననీ, డీఎంఈకి పోస్టింగ్ కోసం లెటర్ రాశానన్నారు. తాను సర్వీసులో ఉన్నానన్నారు.



- డాక్టర్ వరప్రసాద్, క్యాంటీన్ నిర్వాహకుడు, కర్నూలు

చేనేతల కల సాకారం

(5వ పేజీ తరువాయి)

ఇచ్చిన మాట ప్రకారం చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తున్నామని తెలిపారు. త్వరలో చేనేతలకు హెల్త్ పాలసీని అమలు చేస్తామన్నారు.



మెగా టెక్స్‌టైల్ పార్కుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

తండ్రి కలను సాకారం చేసిన తనయుడు

-ఎన్ఎండీ ఫరూక్, మైనార్టీ శాఖ మంత్రి



ఎమ్మిగనూరు అంటే దివంగత నేత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డికి ఎంతో ఇష్టం. ఎప్పుడూ ఎమ్మిగనూరు గురించే ఆలోచించేవారు. బీవీ మోహన్‌రెడ్డి అంటే ఎన్టీఆర్‌కు ఎంతో ఇష్టం. బీవీ మోహన్‌రెడ్డి ఈ ప్రాంతంలో ఎంతో మంది రాజకీయ నాయకులను తయారు చేశారు. అయితే వారే ఆయనకు వెన్నుపోటు పొడిచారు. రాష్ట్రప్రభుత్వం చేనేతలను ఆర్థికంగా బలపరచాలన్న ఉద్దేశంతో ఇలాంటి పార్కులను ఏర్పాటు చేస్తోంది. చేనేత పార్కు ఏర్పాటు చేయాలని బీవీ మోహన్‌రెడ్డి కలలు కన్నారు.. ఆ కలను ఆయన తనయుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి సాకారం చేశారు.

- చేనేత జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి మాట్లాడుతూ టెక్స్‌టైల్ పార్కును మొదటి ఫేస్‌లో అభివృద్ధి చేయడానికి ఏపీఐఐసీ నుంచి రోడ్లు, నీటి సదుపాయం కల్పించేందుకు రూ.6.9కోట్ల నిధులు కేటాయింపు చేశామని వెల్లడించారు. చేనేతలకు త్వరలో ఐడెంటీ కార్డులు ఇప్పిస్తామన్నారు. కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈని నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 8 నియోజకవర్గాల్లో స్థలాలను ఇప్పటికే గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, ఆలూరు, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జిలు వీరభద్రగౌడు, రాఘవేంద్రరెడ్డి, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, పరిశీలకులు శ్రీరాములు, జనసేన నాయకురాలు రేఖాగౌడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, ఏడీహెచ్ నాగరాజరావు, ఏఎస్పీ హుసేన్‌పీరా, డీఎస్పీ ఉపేంద్రబాబు, ఏపీఐఐసీ చీఫ్ ఇంజనీర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

20 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి




సీఎం నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కృషి వల్లే టెక్స్‌టైల్ పార్కు సాధ్యమైంది. ఎంఎస్ఎంఈ పార్కులో మొదటి దశలో 22 ఎకరాల్లో మూడు నెలల్లో రూ.7కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. మిగిలిన 55 ఎకరాల్లో టెక్స్‌టైల్ అనుబంధ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఎమ్మిగనూరు పేరిట శాలువలు తయారు చేస్తే టీటీడీతో పాటు ఇతర ప్రాంతాల్లో మార్కెటింగ్ చేసేందుకు సహకరిస్తా.

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



సభకు హాజరైన చేనేతలు, ప్రజలు

యువగళంలో హామీని నెరవేర్చిన నారా లోకేశ్



యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకే 11 నెలల్లోనే ఎమ్మిగనూరులో మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేశాం. 2004లో నా తండ్రి బీవీ మోహన్‌రెడ్డి అపెరల్ పార్కు తీసుకువస్తే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆ సంస్థను పులివెందులకు తరలించుకుపోయారు. 2014లో ఇక్కడే ముఖ్యమంత్రి చంద్రబాబు హోదాలో టెక్స్‌టైల్ పార్కుకు స్థలం కేటాయించారు. ఆ కక్షతోనే 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ చేనేతలపై ఇబ్బందులకు గురి చేసేలా ఉపాధికి ఉపయోగపడే పార్కు స్థలంలో ఇళ్ల పట్టాలు ఇచ్చి తన నైజాన్ని చాటుకున్నాడు.

- జయనాగేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే, ఎమ్మిగనూరు

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు



రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోంది. కొందరు అభివృద్ధిపై కారు కూతలు కూస్తున్నారు.. వారి నోరు మూయించేలా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అందులో భాగమే ఎమ్మిగనూరులోని టెక్స్‌టైల్ పార్కు. వైసీపీ హయాంలో చేనేతలను నాశనం చేసేందుకే టెక్స్‌టైల్ పార్కుకు కేటాయించిన స్థలంలో ఇళ్ల పట్టాలు ఇచ్చారు.

- పార్థసారథి, ఎమ్మెల్యే, ఆదోని

10 నుంచి టీజీవీ కళాక్షేత్రంలో సాంస్కృతిక వారోత్సవాలు

కర్నూలు కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): టీజీవీ కళాక్షేత్రం గౌరవ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ 75వ జన్మదిన సందర్భంగా టీజీవీ కళాక్షేత్రంలో పదో తేదీ నుంచి 'సాంస్కృతిక వారోత్సవాలు' నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమాలు ప్రారం భమవుతాయని, 10న గజల్ గాయకుడు ఎస్.మహమ్మద్ మియా నిర్వహణలో జానపద సంగీత నృత్య విభావరి ఉంటుందని తెలిపారు. ఇందులో అనంతపురం, కర్నూలు కళాకారులు పాల్గొంటారని తెలిపారు. 11న శ్రీరా మాంజనేయ యుద్ధం (వార్‌సీను) ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి కళాకారులు మొలగవల్లి రవి, నెల్లూరు ఈశ్వర్ గౌడ్ పాల్గొం టారని తెలిపారు. 12న సాయంత్రం కవయిత్రుల సమ్మేళనం ఉంటుందని, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ దండె బోయిన పార్వతీదేవి ఆధ్వర్యంలో కవయిత్రులు పాల్గొంటారు. 13న నగరంలోని శాస్త్రీయ నృత్య శిక్షణలు ఇచ్చే నాట్యాచార్యులతో శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు ఉంటాయి. 14న గాయని సుధారాణి, గజల్ గాయకుడు మహమ్మద్ మియా పర్యవేక్షణలో సినీ సంగీత విభావరి ఉంటుంది. 15న టీజీవీ కళాక్షేత్రం సహాయ కార్య దర్శి సంగా ఆంజనేయులు పర్యవేక్షణలో 'బావా ఎప్పుడు వచ్చితీవు' సాం ఘిక నాటక ప్రదర్శన ఉంటుంది. 16న జబర్దస్త్ ఫేం కళాకారులతో హాస్యవల్లరి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజూ కళాకారులకు సత్కార కార్యక్రమాలు ఉంటాయని, కళ, సంగీత, సాహిత్యాభిమానులు హాజరై ఈసాంస్కృతిక వారోత్సవాలను విజయవంతం చేయాలని పత్తి ఓబులయ్య కోరారు.

ముగ్గురు వైద్యాధికారులపై చర్యలు?

- ముఖ గుర్తింపు హాజరులో ట్యాంపరింగ్
- ఐఫోన్‌లో ఎఫ్ఆర్ఎస్ హాజరు
- విచారణలో నిర్ధారణ



నంద్యాలలోని డీఎంహెచ్‌వో కార్యాలయం

నంద్యాల హాస్పిటల్, మే 6 (ఆంధ్రజ్యోతి): ముఖ గుర్తింపు హాజరులో ట్యాంపరింగ్‌కు పాల్పడిన ముగ్గురు వైద్యాధికారులపై క్రమ శిక్షణ చర్యలు చేపట్టనున్నారు. వైద్యారోగ్య శాఖలో సిబ్బంది హాజరు కోసం ముఖ గుర్తింపు పద్ధతిని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కొందరు సిబ్బంది ఇదే అదనుగా చూసుకొని విధులకు హాజరు కాకపోయినా సెల్‌ఫోన్ ద్వారా చూపిస్తూ ఉండటం ఉన్నతాధికారులు పసిగట్టారు. ప్రభుత్వ వైద్యశాలలో పనిచేసే వైద్యాధికారులు ట్యాంపరింగ్ చేసినట్లు నిర్ధారణ అయింది. నంద్యాల జిల్లాలోని ముగ్గురు వైద్యులకు వైదారోగ్య శాఖ గత నెలలో షోకాజ్ నోటీసులు జారీ చేసింది. జిల్లా వైద్య శాఖాధికారులకు ఎఫ్ఆర్ఎస్ హాజరుపై విచారణ చేపట్టాలని సూచించింది. షోకాజ్ నోటీసులు అందుకున్న వైద్యులు వివరణను సక్రమంగా ఇవ్వలేకపోయారు. వారిపై క్రమశిక్షణపై చర్యలు తీసుకోవాలని ఇటీవల డీఎంహెచ్‌వో వెంకటరమణను ప్రభుత్వం ఆదేశించింది. నారాయణపురం పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ దినేష్, దొర్నిపాడులో పనిచేస్తున్న డాక్టర్ రహుల్లాఖాన్, నంద్యాలలో పని చేస్తున్న డాక్టర్ ఇలియాస్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ముగ్గురికి చార్జీ మెమోలు ఇచ్చేందుకు జిల్లా అధికారులు సిద్ధం చేశారు.

ట్యాంపరింగ్ వాస్తవమే

జిల్లాలో ముగ్గురు వైద్యాధికారులకు ఎఫ్ఆర్ఎస్ హాజరు ట్యాంపరింగ్ చేసిన విషయం వాస్తవమే. రాష్ట్ర శాఖ నుంచి ముగ్గురు వైద్యులపై క్రమ శిక్షణచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముగ్గురికి చార్జిమెమోలు సిద్ధం చేశాం.

- డాక్టర్ వెంకటరమణ, డీఎంహెచ్‌వో, నంద్యాల

కొమ్మ కొమ్మకూ పక్షి



మండు వేసవిలో ఓ వైపు చెట్లు ఎండిపోతున్నాయి. ఉన్న చెట్లకు ఆకులు రాలిపోతున్నాయి. ఎండలకు తట్టుకోలేక పక్షులు సైతం చల్లటి స్థావరాల కోసం అన్వేషిస్తున్నాయి. ఈ క్రమంలో కర్నూలు మండల పరిధిలోని గార్గేయపురం చెరువు వద్ద ఓ మోడుబారిన చెట్టుపై పక్షుల గుంపు ఇలా వాలిపోయి సరికొత్త అందాన్ని సృష్టించాయి.

- కర్నూలు రూరల్ (ఆంధ్రజ్యోతి). ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కర్నూలు

చెట్టు చెట్టుకూ చీర




ప్రస్తుతం ఎండలు దంచికొడుతున్నాయి. ఈ ఎండ వేడిమి నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులు ఆపసోపాలు పడుతున్నారు. మరీ ముఖ్యంగా పండ్ల తోటల రైతులు పంటను రక్షించుకునేందుకు శ్రమిస్తున్నారు. రుద్రవరం మండలంలోని ఆలమూరు గ్రామంలో రైతులు బొప్పాయి పండ్లకు రక్షణకు చీరలు చుట్టారు. ఎండ నుంచి సంరక్షించుకునేందుకు ఇలా కొత్తగా ఆలోచిస్తున్నారు. పండ్లు ఉన్న ప్రతి చెట్టుకూ చీరను చుట్టి ఎండ నుంచి రక్షణ పొందుతున్నామని రైతులు శేఖర్, రాముడు, హుసేనీ తెలిపారు.

- రుద్రవరం (ఆంధ్రజ్యోతి)

మట్టి మిద్దె కూలి..

- ఇద్దరు భవన నిర్మాణ కార్మికుల దుర్మరణం
- మరో ఇద్దరికి గాయాలు



ఉయ్యాలవాడ మండలం ఆర్.పాంపల్లెలో కూలిన మట్టి మిద్దె



నారాయణ(ఫైల్)



యోనా (ఫైల్)

ఉయ్యాలవాడ, మే 6 (ఆంధ్రజ్యోతి): మట్టి మిద్దెను పెకిలిస్తుండగా పైకప్పు కూలి ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు దుర్మరణం చెందారు. ఈ ఘటన ఉయ్యాలవాడ మండలం ఆర్.పాంపల్లె గ్రామంలో చోటుచేసు కుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఆర్.పాంపల్లెకు చెందిన గంప తిరుపాలు మట్టి మిద్దెకు మరమ్మతులు చేయిస్తున్నాడు. మిద్దె పైకప్పు కూలి అదే గ్రామానికి చెందిన పొగాకు నారాయణ(40), ఆళ్లగడ్డ మండ లం ఎస్.లింగందిన్నెకి చెందిన బండి యోనా(45) అక్కడికక్కడే మృతి చెం దారు. మట్టి మిద్దెకు మరమ్మతులు చేయటానికి ఆళ్లగడ్డ, ఎస్.లిగందిన్నె గ్రామాలకు చెందిన ఏడుగురు రూ.11వేలకు గుత్తకు ఒప్పుకొని శనివారం ఉదయం పనులు ప్రారంభించారు. మిద్దెకింద ఉన్న బండలను మంగళ వారం తొలగిస్తుండగా ఒక్కసారిగా పైకప్పు కూలి నారాయణ, యోనాలు, కుమార్, బాబులపై పడింది. నారాయణ, యోనాలు మట్టి కింద కూరుకు పోగా కుమార్, బాబులు గాయాలతో బయట పడ్డారు. మిగిలిన ముగ్గురు ప్రమాదం నుంచి తప్పించుకోగలిగారు. మట్టిలో కూరకుపోయిన వారిని వెలికి తీసి ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు.

అనాథలైన కుటుంబీకులు

ఇంటి పెద్దలను కోల్పోవటంతో ఇరు కుటుంబాలుకు చెందిన వారు అనాథలుగా మిగిలారు. అనాధలుగా మిగిలారు. వారు ప్రతి రోజూ కూలీ పనికి వెళ్తే తప్ప పూట గడవని పరిస్థితి వారిది. కుటుంబ పెద్దను కోల్పోవడంతో వారు చేస్తున్న అర్తనాదాలు పలువురిని కంట తడిపెట్టిం చాయి. మృతుడు నారాయణకు ఐదేళ్ల క్రితం మొదటి భార్య చనిపో వటంతో మూడేళ్ల క్రితం అనంతపురం జిల్లాకు చెందిన లలితను వివిహం చేసుకున్నాడు. వీరికి 30రోజుల వయస్సున్న కుమార్తె ఉంది. మొదటి భార్య సంతానం ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు యోనాకు నలుగురు కుమార్తెలు, భార్య లీలావతి ఉన్నారు. పెద్దకుమార్తె ఆరుణకు రెండేళ్ల క్రితం వివామమైంది. రెండో కుమార్తె స్వప్న దివ్యాంగురాలు, మూడవ కుమార్తె రాణి ఇంటర్ పూర్తిచేసి ఇంటి వద్దే ఉండి తల్లి దండ్రులకు సహాయపడుతోంది. నాల్గవ కుమార్తె బేబి ఇంటర్ ఫస్ట్ ఇయర్ పూర్తి చేసింది. ఈ ఘటనపై ఉయ్యాలవాడ ఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



నాగరాజు(ఫైల్)

మద్దికెర, మే 6 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపి న వివరాలు.. మండలంలోని పెరవలి గ్రామంలోని బీసీ కా లనీలో మంగళి నాగరాజు(38) నివాసం ఉంటున్నాడు. త నకున్న మూడెకరాల పొలంతో పాటు మరో మూడు ఎకరా లు కౌలుకు తీసుకుని సద్ద, కంది పంటలను సాగుచేశాడు. రెండేళ్లుగా పంటలు చేతికి రాలేదు. ఈఏడాది కూడా పం టలు ఆశాజనకంగా లేకపోవడంతో దిగుబడి కూడా రాక.. అప్పులు మరింత ఎక్కువయ్యాయి. అప్పులు రూ.6 లక్షల వరకు చేరాయి. వారం రోజుల నుంచి దిగాలుగా ఉండే వాడని కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం తన ఇంటి ముందు వరండాలో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్సకోసం పత్తికొండ ప్రభుత్వ వైద్య శాలకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడు నాగరాజుకు ముగ్గురు కుమార్తెలు ఉ న్నారు. భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ విజ యకుమార్‌నాయక్ కేసు నమోదుచేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పత్తికొండ ఆస్పత్రికి తరలించారు. ఈ రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ నాయకులు మంగళి రంగస్వామి విజ్ఞప్తి చేశారు. అనంతరం టీడీపీ నాయకులు మంగళి నాగరాజు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించారు.

చికిత్స పొందుతూ యువకుడు..

చాగలమర్రి, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగల్లపాడు గ్రామ సమీపంలో 40వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డుప్రమా దంలో హైదరాబాదుకు చెందిన వీరేన్ (17) అనే యువకుడు చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. హైదరాబాదు నుంచి కడపకు వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో ఐదుగురు గాయపడ్డారు. వీరిలో వీరేన్ తీవ్రంగా గాయపడటంతో నంద్యాల ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మానవత్వం చాటుకున్న మంత్రి

డోన్ రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మా నవత్వాన్ని చాటుకున్నారు. మంగళవారం ప్రభుత్వ కార్యక్రమాలు ముగిం చుకుని డోన్ మండలం హైవే మీదుగా మంత్రి పెనుగొండకు బయలుదేరారు. బుచ్చ



క్షతగాత్రులకు సిబ్బందితో ప్రథమ చికిత్స చేయిస్తున్న మంత్రి సవిత

యగారిపల్లె నుంచి హైదరాబా దుకు మామిడికాయల లోడుతో వెళ్తున్న వ్యాన్ టైరు పేలిపోవడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అనంతపురం జిల్లా పెరవలి మండలం సుబ్బరాయునిపల్లె గ్రామానికి చెందిన డ్రైవర్ శ్రీనివాసులకు, క్లీనర్ నాగరాజుకు గాయాలయ్యాయి. అటువైపు వెళ్తున్న మంత్రి గమనించి తన కాన్వాయ్‌ను ఆపి క్షతగాత్రులను పరామర్శించారు. తన కాన్వాయ్‌లో ఉన్న ప్రథమ చికిత్స కిట్టుతో బాధితులకు తన సిబ్బదితో వైద్యం చేయించారు. అంబులెన్స్ ద్వారా డోన్ ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

9 నుంచి ఇరవై సూత్రాల కమిటీ చైర్మన్ పర్యటన

- తెలుగు గంగ ఎస్ఈ శివప్రసాద్‌రెడ్డి

నంద్యాల మున్సిపాలిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): ఇరవై సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకర్ ఈనెల 9వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఉమ్మడి జిల్లాలో పర్యటించ నున్నట్లు తెలుగు గంగ ఎస్ఈ శివప్రసాదర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9, 10వ తేదీల్లో గోరుకల్లు రిజర్వాయర్‌ను తనఖీచేసి కర్నూలు సోలార్ ప్రాజెక్టును పరిశీలిస్తారని, అనంతరం అహోబిలం, యాగంటి పుణ్య క్షేత్రాలను సందర్శించి కర్నూలు జిల్లా జోహ రాపురంలో పర్యటి స్తారని పేర్కొన్నారు. పర్యటన అనంతరం నంద్యాల కలెక్టర్‌తో సమావేశమై రాత్రి ప్రము ఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం వెళ్లి రాత్రి బస చేస్తారని తెలిపారు. 11వ తేదీ ఆదివారం ఉదయం శ్రీశైల భ్రమరాంబ స్వామి అమ్మవార్ల దర్శనాంతరం ఆత్మకూరులో పర్య టిస్తారు. అత్మకూరు పర్యటన ముగిశాక విజయవాడ బయలుదేరి వెళ్తారన్నారు.

కూలీ పనులకు వెళ్లి..

- విద్యుదాఘాతంతో ఇద్దరు యువకుల మృతి
- మృత్యువులోనూ వీడని స్నేహబంధం
- రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం




సునీల్, మహేంద్ర(ఫైల్)

కౌతాళం, మే 6(ఆంధ్రజ్యోతి): వారిద్దరు స్నేహితులు.. కలిసి కూలీ పనులకు వెళ్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. మంగళ వారం కూలీ పనులకు వెళ్లారు. విద్యు దాఘాతానికి గురై మృత్యువులోనూ స్నేహ బంధాన్ని వీడకుండా ఇరు వురు అనంత లోకాలను చేరని హృదయ విదారక ఘటన మండ లంలోని ఉరుకుంద గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఉరుకుంద గ్రామంలోని దళితకాలనీకి చెందిన కట్టమీద సునీల్ అలియాస్ నాని(24), అదేకాలనీకి చెందిన మహేంద్ర(23) స్నేహితులు. ప్రతిరోజు ఇద్దరు కలిసి కూలీ పనులకు వెళ్ళి కుటుంబాలను పోషించేవారు. రోజువారీ కూలీలో భాగంగా మంగళవారం ఉదయం గ్రామంలోని ఓ సంఘం కల్యాణ మంటపంలో జరుగు వివాహ కార్యక్రమానికి టెంట్ వర్క్ కోసం పనులకు వెళ్లారు. టెంట్ వేస్తున్న సమయంలో పక్కన ఉన్న విద్యుత్ తీగలను గుర్తించలేదు. ఇనుప కడ్డీలు విద్యుత్ తీగలకు తగిలాయి. చేతుల్లో ఉన్న కడ్డీలకు విద్యుత్ సరఫరా అయ్యింది. వారిద్దరూ ఒకేసారి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు ఘటనాస్థలికి చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంబ పెద్ద అకాల మృతితో తమకు దిక్కెవరని సునీల్ భార్య వినిత రోదిస్తున్న తీరు అక్కడ ఉన్నవారిని కంటతడి పెట్టించింది. సునీల్‌కు భార్యతో పాటు రెండేళ్ల కుమార్తె, ఐదు నెలల కుమారుడు ఉన్నాడు. మృతుల కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కౌతాళం సీఐ అశోక్‌కుమార్ కేసు చేసి మృత దేహాలను ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. కేసు నమోదు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తున్న పోలీసులు

డోన్ టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలైన ఘటన పట్టణ సమీపాన మంగళ వారం చోటుచేకున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. వివరాలు.. వెంకటాపురం నుంచి డోన్ వస్తున్న ట్రాక్టర్ పెద్ద వంక వద్ద ద్విచక్ర వాహనం తప్పించబోయి లక్ష్మింపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశ్(20) ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని సోదరుడు తిరుమలేష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగరాజు, పోలీసు సిబ్బంది ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాయకులు కలిసికట్టుగా ముందుకు సాగాలి

- కరెంటు, రైతు సమస్యలపై పోరాటాలకు సిద్ధంకావాలి
- నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, నాయకులందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే, నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళ వారం కర్నూలులోని తన స్వగృహంలో ఆయన వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యేలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కాటసాని మాట్లా డుతూ కరెంటుచార్జీల పెంపు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎలాంటి పోరా టాలకైనా సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బీజేంద్రనాథ్ రెడ్డి నందికొట్కూరు ఇన్‌చార్జి దారా సుధీర్, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నంద్యాల విజయ డెయిరీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



మృతి చెందిన ఆవుదూడ వద్ద బాధితుడు సేవా నాయక్

ఆవుల మందపై పెద్దపులి దాడి

వెలుగోడు, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని మద్రాసు కాలువ సమీపంలో పెద్దపులి వరుసగా రెండో రోజు పెద్దపులి ఆవులమందపై దాడి చేసింది. ఈ దాడిలో మంగళవారం తెల్లవారుజామున ఓ ఆవుదూడ మృత్యువాత పడింది. మొదటిరోజు ఆవుపై దాడి చేయగా ఆవు మృతి చెందింది. ఆ ప్రాం తానికి చేరుకున్న అటవీ అధికారులు ఆ ఆవుల మందను మరో ప్రాంతానికి తరలించారు. అయినప్ప టికీ పెద్దపులి ఆ ఆవుల మందపై తిరిగి దాడి చేసింది. గత రెండు రోజుల నుంచి సేవానాయక్ చెందిన ఆవుల మందపై పెద్దపులి దాడి చేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతు న్నారు. సంఘటన స్థలానికి అటవీ అదికారులు చేరుకొని వివరాలు సేకరించి పలు సూచనలు తెలిపారు. ఆవుల మందపై దాడి చేస్తున్న సమయంలో ఆపులిని ఆవులమంద యజమాని తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి పెద్దపులిని సైతం చూపించడం గమనార్హం.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

- డ్వామా పీడీ వెంకట రమణయ్య



ఆలూరులో పండ్ల తోటలను పరిశీలిస్తున్న పీడీ

ఆలూరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటలు సాగు చేసే చిన్నసన్న కారు రైతులకు ప్రభుత్వం ప్రోత్సా హం అందిస్తుందని డ్వామా పీడీ వెంకట రమణయ్య అన్నారు. మంగళవారం పెద్దహోతూరు ఉపాధిహామీ పథకం కించ చేసిన నీటి కుంటలు పండ్ల తోటలను పరిశీలించారు. ఐదు ఎకరాలల్లోపు పొలం ఉన్న రైతులకు మామిడి, జామ, సపోట తదితర మొక్కలు అందిస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనుల్లో 1.06లక్షల మంది పని చేస్తున్నారు. మే చివరి నాటికి 2వేల నీటి గుంతలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. పెండింగ్ ఉపాధి కులీలకు వేతనాలను వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. సీసీ రోడ్లు, గోకల షెడ్ల బిల్లులు త్వరలో విడుదల అవుతాయని తెలిపారు. ఏపీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించండి

పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



కార్పొరేషన్ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ, మే 6(ఆంధ్రజ్యోతి): వేసవిలో నగర వాసులకు తాగునీటి సమస్య రాకుండా అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. మంగళవారం స్థానిక రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో నగర పాలక సంస్థ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నగరాభివృద్ధిపై ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ముందుగా గతంలో జరిగిన 5 సమావేశాల చర్చించిన అంశాలపై పురోగతిపై చర్చించారు. అనంతరం పూడికతీత పనులపై ఆరా తీశారు. తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా సుంకేసుల జలాశయంలో తగిన నీరు ఉండేలా చూసుకోవాలని సూచించారు. అంబేడ్కర్ కూడలి నుంచి పెద్దమార్కెట్ వరకు రహదారి విస్తరణ చేపట్టాలని పేర్కొన్నారు. ఆనంద్ థియేటర్ సమీపంలోని హంద్రీ ఒడ్డున ప్యాకెట్ పార్కు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈనెల 17న పారిశుధ్య విభాగం అధికారులతో, కాంట్రాక్టర్లతో వేరువేరు సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. తెలుగుతల్లి విగ్రహంతో పాటు అవసరమైన చోట్ల సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అక్రమ షాపులు తొలగించాలని, 21 కమ్యూనిటీ హాల్స్ మరమ్మతులు చేపట్టి స్థానికులకు అప్పగించాలన్నారు. ఈ నెల 15న కాలనీలకు, కూడళ్లకు కొత్తగా పెట్టిన పేర్లతో ప్రారంభోత్సవం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రవీంద్రబాబు, అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డా.విశ్వేశ్వర రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్వోలు ఇజ్రాయేలు, జునైద్, టీపీఆర్వో వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్లు రామకృష్ణ, స్వర్ణలత, వాజీద్, మంజూర్ బాషా, సుబ్బన్న పాల్గొన్నారు.

మహనీయులను స్మరించుకుందాం



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ లాంటి మహనీయులను స్మరించుకుందామని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం సాయంత్రం కర్నూలు నగరంలోని ఉల్చాల రోడ్డు వైజంక్షన్‌కు ఛత్రపతి శివాజీ సర్కిల్‌గా మంత్రి నామకరణం చేశారు. ఆయన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డితో కలిసి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ సేవలు మరువలేనివి

కర్నూలు స్పోర్ట్స్, మే 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ క్రికెట్ సంఘం కార్యదర్శి శింగారి చంద్రశేఖర్ సేవలు మరువలేనివని మిత్ర బృందం కొనియాడారు. జిల్లాలో రంజీ ట్రోఫీ క్రీడను నిర్వహించిన ఘనత ఆయనకే దక్కింది. అలాగే మహిళల క్రికెట్ సంఘం కార్యదర్శిగా కొనసాగారు. ఆయనకు మిత్రబృందం డాక్టర్ పి.గోవర్దన్ రెడ్డి కె.రవీంద్రారెడ్డి, డాక్టర్ ఎస్.మాణిక్యరావు, ఎస్.నగేష్, ఆనంద కుమార్, ఎంవీ ఎస్.సుధీర్ (లండన్), పి.విజయానందరెడ్డి నందకిషోర్ (యూఎస్ఏ) నివాళులర్పించారు.

ప్రభుత్వ ఖాజీగా ఇస్మాయిల్ మౌలానా

కల్లూరు, మే 6(ఆంధ్రజ్యోతి): కల్లూరు అర్బన్ ప్రభుత్వ ఖాజీగా ఇస్మాయిల్ మౌలానాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సహకారంతో కల్లూరుకు చెందిన ఇస్మాయిల్ మౌలానా ప్రభుత్వ ఖాజీగా నియామకమయ్యారు. మంగళవారం మాధవీ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గౌరు దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతను క్రమశిక్షణతో నిర్వర్తించి, ముస్లింలకు సేవ చేస్తానని ఇస్మాయిల్ మౌలానా తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం, మైనారిటీ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

మాతాశిశు సంక్షేమ సేవల బలోపేతానికి కిల్కారీ మెసేజ్ అమలు

కర్నూలు హాస్పిటల్, మే 6(ఆంధ్రజ్యోతి): మాతాశిశు సంక్షేమ సేవల బలోపేతానికి ప్రభుత్వం కిల్కారీ మెసేజ్ సేవలు ప్రారంభించినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ తెలిపారు. నగరంలోని ముజఫర్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన ఆశా సమీక్ష సమావేశానికి డీఎంహె చ్‌వో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కిల్కారి మెసేజ్ విధానంలో గర్భిణులకు నాలుగో మాసం నుంచి కాన్పు తర్వాత ఒక సంవత్సరం వరకు వారానికి ఒకసారి 72 వారాలు వాయిస్ మెసేజ్ 01244451660 నెంబరు నుంచి వస్తుందన్నారు. ఏదైనా కారణంతో గర్భిణి తల్లి ఆ వాయిస్ మెసేజ్ వినలేకపోతే తర్వాత 14423 నెంబరుకు కాల్ చేసి వాయిస్ మెసేజ్‌ను వినడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డా.మంజూషా, డీసీఎం ప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హాస్టళ్లల్లో సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు అర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో హాస్టళ్లల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి ఎస్.నాగార్జున డిమాండ్ చేశారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ప్రస్తుతం వార్డెన్లు మెనూ ప్రకారం సరుకులు ఇవ్వడం లేదన్నారు. తుంగభద్ర, సంగమేశ్వర, జోగుళాంబ హాస్టళ్లలో చేపట్టిన మరమ్మతు పనులు నత్తనడకన జరుగుతున్నాయని అన్నారు. మెస్ వ్యవస్థను పర్యవేక్షించేందుకు కొత్త కమిటీలను ఏర్పాటు చేయాలని, చీఫ్ వార్డెన్ భోజన నాణ్యతపై నిత్యం తనిఖీలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సునీల్, సాయి, కృపాకర్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకోం

సి.బెళగల్, మే 6(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకోమని ఎస్ఐ పరమేష్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విష్ణుహమాలీ యూనియన్ నాయకులు ఇటీవల విధుల్లో చేరిన ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో నాయకుడు భీమన్న, రాజు పాల్గొన్నారు.

బాధితులకు ఎస్వీ పరామర్శ

కర్నూలు హాస్పిటల్, మే 6(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దర్శనం చేసుకుని తిరిగి వస్తు రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న ఆదోని బాధితులను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి పరామర్శించారు. ఎస్వీ వెంట ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఉన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ఓర్వకల్లు, మే 6(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. మంగళవారం నన్నూరు గ్రామ సమీపంలోని రాగమయారిలోని రెడ్డి సంక్షేమ సంఘం నుంచి మెయిన్ రోడ్డు వరకు ఉపాధి నిధులు రూ.10లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతకుముందు ఎమ్మెల్యేకు నాయ కులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పల్లె పండుగ కార్యక్ర మంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి నిధులతో రూ.1.50 కోటితో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు, గోకులం షెడ్లు చేపట్టారన్నారు. ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. మండలానికి మరెన్నో పరిశ్రమలు రాబోతున్నాయని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకా శాలు పుష్కలంగా లభిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఏఈ సురేంద్రనాథ్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు విశ్వేశ్వరరెడ్డి, నాయకులు పుసులూరు ప్రభాకర్ రెడ్డి, విజయుడు, ఖాజామియా, నాగేశ్వరరెడ్డి, ప్రతాప్, ఎల్ఐసీ మద్దయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



నన్నూరులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

కోడుమూరు రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి జీవీ వీరన్న, యూనియన్ నాయకురాలు సుబేదా డిమాండ్ చేశారు. లద్దగిరి పీహెచ్‌సీలో మంగళవారం ఆశా వర్కర్లు వైద్యాధికారి భాస్కర్, సీహెచ్‌వోకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో సరోజ, సువర్చల, సరస్వతి, రేణుక, లక్ష్మీ, సుజాత పాల్గొన్నారు.



వైద్యాధికారికి సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశా వర్కర్లు

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

కల్లూరు: ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ నగర కార్యదర్శి సీహెచ్.సాయిబాబా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మేడే వారోత్సవాల్లో భాగంగా కల్లూరు, ముజఫర్ నగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సీఐటీయూ నాయకుల ఆధ్వర్యం లో జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ఆశావర్కర్లకు పనిభారం తగ్గించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను మార్చి 4 లేబర్ కోడ్లు తీసుకురావడం కార్మికుల హక్కులను హరించడమే అన్నారు. ఈనెల 20న జరిగే సమ్మెలో నల్లబ్యాడ్జీలు ధరించి ఆశాలు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం కల్లూరు, ముజఫర్ నగర్ మెడికల్ ఆఫీసర్లకు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో గోపాల్, సుధాకరప్ప, జీఏసు పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్: ఆశా వర్కర్లలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ నగర అధ్యక్షులు ఆర్.నరసిం హులు డిమాండ్ చేశారు. నగరంలోని 23వ వార్డులోని శ్రీరామ్‌నగర్‌లో ఉన్న అర్బన్ హెల్త్‌సెంటర్ వద్ద మే డే వారోత్సవాలను పురస్కరించుకుని ఆయన జెండాను ఆవిష్కరించారు. ఆశాలకు పనిభద్రత కల్పించి పర్మినెటు ఉద్యోగులుగా చేయాలని ఆరోగ్య రంగానికి కనీసం 6 శాతం నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు పద్మావతి, నాగమణి, నాగమ్మ, శాంతకుమారి పాల్గొన్నారు.

నేటి నుంచి సమ్మెలోకి ఇంజనీరింగ్ కార్మికులు

జీతాలు పెంచాలని డిమాండ్

కర్నూలు న్యూసిటీ, మే 6(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు బుధవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులకు తక్షణమే జీతాలు పెంచాలని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సమ్మెలోకి వెళ్లాలని కార్మికులు నిర్ణయించారు. ఈమేరకు నగర పాలక కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టేందుకు సిద్ధమయ్యారు. గత సంవత్సరం డిసెంబరులో కూడా కార్మికులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సుమారు 10 రోజులపాటు వివిధ దశలుగా ఆందోళనలు చేశారు. అయితే ఉన్నతా ధికారుల ఆదేశాల మేరకు సమ్మెకు విరమించారు. ఈ క్రమంలో తమకు జరగాల్సిన న్యాయం జరగకపోవడంతో మరోసారి సమ్మెలోకి వెళ్లాలని రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది. నగర పాలకలో సుమారు 360 మంది కార్మికులు ఉన్నారు. గత 30 సంవత్సరాల నుంచి ఇంజనీరింగ్ విభాగంలో వివిధ వృత్తులను చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు జీతంతోపా టు హెల్త్ అలవెన్సు పెంచి రూ.21వేలు, డ్రైవర్లకు రూ.24వేలు మంజూరు చేసింది. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికులకు సేవలను ఎందుకు గుర్తించడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను దృష్టిలో ఉంచు కుని జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. గత సంవత్సరం రాష్ట్ర యూనియన్ సీడీఎంఏకు సమస్యలపై వినతి పత్రం అందజేసిన కూడా ఎలాంటి స్పందన లేదని కార్మికులు వాపోతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం

కర్నూలు న్యూసిటీ, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్క రించడంలో నగర పాలకులు విఫలమయ్యారని సీపీఎం నగర కార్యదర్శి రాజశేఖర్ విమర్శించారు. మంగళవారం రాధాకృష్ణ థియేటర్ ఎదురుగా కంకర తేలిన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు కంకర లేని ప్రజల రాకపోకలకు తీవ్రమైన ఇబ్బందులు కలుగుతున్న కార్పొరేటర్లు పట్టించుకోవడం లేదని విమర్శిం చారు. మేయర్ పదవి నీదా.. నాదా అని వైసీపీ, టీడీపీ కార్పొరేటర్లు వాదులాడుకోవడం తప్ప నగర అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని అన్నారు. తక్షణమే రోడ్డు వేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శివర్గసభ్యులు ఎస్ఎండీ షరీఫ్, నాగస్వాములు, గౌస్‌బాషా, ఖలీల్‌అహ్మద్, ప్రకాష్, పరుశరాముడు పాల్గొన్నారు.

త్వరలో కల్లూరు రైతు బజారు ప్రారంభం

కర్నూలు అగ్రికల్చర్, మే 6(ఆంధ్రజ్యోతి): కొద్దిరోజుల్లో కల్లూరులోని గోవర్ధన్ నగర్‌లో రైతుబజారును ప్రారంభించబోతున్నట్లు సి.క్యాంపు రైతు బజారు హార్టికల్చర్ అసిస్టెంట్ అధికారి శివకుమార్ తెలిపారు. ఈ రైతుబజారులో ఆర్వోఆర్ ప్లాంటును మంగళవారం హార్టికల్చర్ అసిస్టెంట్‌తో పాటు మార్కెటింగ్ శాఖ ఇంజనీరింగ్ సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవర్ధన్ నగర్‌లో రైతుబజారు ప్రారంభమైతే పారిశ్రామిక వాడ కల్లూరు కాలనీల ప్రజలు, కార్మికులకు తక్కువ ధరకే నాణ్యమైన కూరగాయలు లభిస్తాయన్నారు. అదేవిధంగా కల్లూరు మండలంలోని దాదాపు పది గ్రామాల రైతులు ఈ రైతుబజారుకు తాము పండించిన కూరగాయలను తీసుకుని వచ్చి గిట్టుబాటు ధర పొందవచ్చన్నారు.



ఆర్వోఆర్ ప్లాంటు ఏర్పాటును పరిశీలిస్తున్న అధికారులు

నాసిరకం పత్తి విత్తనాలు విక్రయిస్తే చర్యలు

సి.బెళగల్, మే 6(ఆంధ్రజ్యోతి): రైతులకు నాసిరకం పత్తి విత్తనాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లో విత్తన దుకాణాల యజమానులు రైతులకు విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన పత్తి విత్తనాల ప్యాకెట్లను పరిశీలించి, వాటి నాణ్యత గురించి వారికి వివరించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడు తూ రైతులకు విక్రయించే ప్రతి ప్యాకెట్‌ను తమ రికార్డులలో నమోదు చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీవోలు ఉన్నారు.

తైక్వాండో శిక్షణను వినియోగించుకోండి

కర్నూలు స్పోర్ట్స్, మే 6(ఆంధ్రజ్యోతి): నగరంలో ఉచిత తైక్వాండో శిక్షణను వినియోగించుకోవాలని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. మంగళవారం తన స్వగృహంలో తైక్వాండో శిక్షణ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. నాలుగు చోట్ల తైక్వాండో శిక్షణను కోచ్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరుగుతున్నాయని, వేసవిలో సెలవులు వృథా కాకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను శిక్షణలో హాజరయ్యేటట్లు సహకరించాలని ఆయన తెలిపారు. కొండారెడ్డి బురుజు కేఎంసీ పార్కు, పెద్ద మార్కెట్ కేఎంసీ పార్కు, కర్నూలు యునైటెడ్ క్లబ్ ఆవరణలో, వెంకటరమణకాలనీ కేఎంసీ పార్కులోల శిక్షణ నిర్వహిస్తున్నట్లు కోచ్ వెంకటేశ్వర్లు తెలిపారు.

రేపటి నుంచి నారసింహుడి ఉత్సవాలు

కోడుమూరు రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడు మలగుర్తిలో గురువారం లక్ష్మీనరసింహ ఈరన్నస్వామి వార్షిక ఉత్సవాలు జరిపించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఇందులో భాగంగా 8న గణపతిపూజ, అభిషేకం, 9న అమ్మవారికి కుంకుమార్చనలు, సాయంత్రం ప్రభోత్సవం, 10న కలశపూజ, వాస్తుపూజ, అభిషేకం, సాయంత్రం భూదేవి ఊరేగింపు 11న గణపతిపూజ, పుణ్యాహవాచనం, హోమం, స్వామిఅమ్మవార్లకు కల్యాణం, సాయంత్రం రథోత్సవం 12న నంది కోలసేవ, చక్రస్నానంతో ఉత్సవాలకు ముగియనున్నట్లు తెలిపారు. ఇం దులో భాగంగా ఈనెల 11న రాత్రి డ్యాన్స్ బేబీ డ్యాన్స్, 12న ముగ్గులు, ఎద్దుల బండలాగుడు పోటీలు, 13న పొట్టేళ్ల పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు దాతల సాయంతో నగదు బహుమతి అందజేస్తారు.

ఈశ్వరమ్మ వర్ధంతి

కర్నూలు కల్చరల్, మే 6(ఆంధ్రజ్యోతి): స్థానిక నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో పుట్టపర్తి సత్యసాయిబాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరమ్మ చిత్రపటానికి భక్తులు పూలమాలలు వేశారు. అనంతరం గత పదిహేను రోజులుగా సత్యసాయి మందిరంలో బాలవికాస్ ఆధ్వర్యంలో చేపట్టిన వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణలు పూర్తి చేసుకున్న విద్యార్థులతో గీతా, పద్య పఠనం నిర్వహించి, వారికి బహుమతులు ప్రదానం చేశారు.

నేడు ప్యాలకుర్తిలో దేవర

కోడుమూరు రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాల కుర్తిలో బుధవారం గ్రామదేవతలు మారెమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు దేవర నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. దాదాపు 15 ఏళ్ల అనంతరం దేవర జరిపిస్తున్నట్లు వారు తెలిపారు. మంగళవారం సాయంత్రం అమ్మవార్ల విగ్రహాలను మేళతాళాలు, చెక్కభజన మధ్య ఆచారుల ఇంటి నుంచి ఆలయం చేర్చారు. బుధవారం అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించనున్నట్లు వివరించారు. దేవరను పురస్కరించుకుని ఇంటింటా బంధుమిత్రులతో సందడి నెలకొంది.

పొగాకు కంపెనీలపై చర్యలు తీసుకోవాలి

ఓర్వకల్లు, మే 6(ఆంధ్రజ్యోతి): పొగాకు పంటను కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఓర్వకల్లులోని పొగాకు గోడౌన్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, సీఐటీయూ మండల నాయకులు సుధాకర్ మాట్లాడుతూ గత సంవత్సరం రైతుల వద్ద పొగాకు కంపెనీలు సమావేశాలు ఏర్పాటు చేసి పొగాకును పండించాలని చెప్పి.. ప్రస్తుతాం పొగాకు ఎక్కువైందని, కొనుగోలు చేయడం లేదని చెప్పడం సరైన పద్ధతి కాదని అన్నారు. గత ఏడాది క్వింటం రూ.16వేల నుంచి రూ.18వేల వరకు కొనుగోలు చేశారని, ఈ ఏడాది పొగాకు దిగుబడి ఎక్కువ కావడంతో రూ.10వేల నుంచి రూ.12వేల ధర వేస్తున్నారన్నారు. చిన్నసన్న కారు రైతులను ప్రైవేటు కంపెనీలు మోసం చేసి రూ.కోట్లు దండుకుంటుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ నెల 8న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టే ధర్నాకు పొగాకు రైతులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పొగాకు రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు రామకృష్ణ

అమ్మవారికి బంగారు నగ సమర్పణ

గూడూరు, మే 6(ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం కె.నాగలాపురం లోని సుంకులాపరమేశ్వరి అమ్మవారికి 10 గ్రాముల బంగారు కాసుల నగను భక్తులు కానుకగా సమర్పించినట్లు ఆలయ సిబ్బంది కేశవ తెలిపారు. మంగళవారం కె నాగలాపురం సుంకులాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న శ్రీరామ నగర్‌కు చెందిన కెదాసు నరసింహులు, మహేశ్వరమ్మ వారి కుటుంబ సభ్యులు 10 గ్రాముల బంగారు కాసుల నగను అమ్మవారికి కానుకగా సమర్పించారు.



ఆలయ సిబ్బందికి బంగారు కాసుల నగను అందజేస్తున్న భక్తులు

వైఎస్ షర్మిల పర్యటన వాయిదా

కర్నూలు అర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఈనెల 11న జిల్లా పర్యటన అనివార్యకారణాలతో వాయిదా పడిందని నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు పర్యటనకు సంబంధించి తదుపరి షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

నేడు విచారణ

కర్నూలు ఎడ్యుకేషన్, మే 6(ఆంధ్రజ్యోతి): స్థానిక బిర్లా కాంపౌండు సంక్షేమ భవనంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా పని చేస్తున్న విజయలక్ష్మిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసిదేవి ఆధ్వర్యంలో బుధవారం విచారణ కొనసాగనుంది. విజయలక్ష్మి కారుణ్య నియామకం నుంచి పదోన్నతి, ఆ తర్వాత ఎస్సీ కార్పొరేషన్ నిధుల దుర్వినియోగం వచ్చిన ఆరోపణలపై మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకటేశ్, ఏపీసీసీఎఫ్‌సీ లిమిటెడ్ ఎండీకి ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు ఎస్సీ కార్పొరేషన్ జిల్లా కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగనుంది.

ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలి

కర్నూలు అర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో ప్రొఫెసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బహుజన విద్యార్థి వేదిక (పీడీఎస్‌యూ) జాతీయ అధ్యక్షుడు బీవీ రమణ డిమాండ్ చేశారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. వర్సిటీలో ప్రొఫెసర్లు లేక బోధనలో నాణ్యతా ప్రమాణాలు తగ్గిపోయాయని అన్నారు. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులతోపాటు రిజిస్ట్రార్ పోస్టును కూడా స్థానిక ప్రొఫెసర్లతోనే భర్తీ చేయాలని కోరారు.

వేసవి శిక్షణ తరగతులు వినియోగించుకోవాలి

కర్నూలు న్యూసిటీ, మే 6(ఆంధ్రజ్యోతి): విరామ బైబిల్ పాఠశాల తరగుతులను వినియోగించుకోవాలని కోల్స్ సెంటీనియల్ చర్చి ప్రతినిధి అబ్రహంలింకన్ అన్నారు. పది రోజులుగా చర్చి ఆధ్వర్యంలో చిన్నారులకు బైబిల్ విరామ తరగుతులు మంగళవారం ముగిశాయి. ఈసందర్భంగా కోల్స్ చర్చి నుంచి ఎస్‌బీఐ కూడలి, కొండారెడ్డి బురుజు వరకు చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. దేవమనోహర్‌రాజు, సుధీర్ జార్జ్, కిరణ్నాయి, రవికుమార్, అనిల్‌కుమార్, సంజీవరావు, మధుకర్, సంపత్, పాస్టర్లు, సంఘ నాయ కులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాహూ మహారాజుకు నివాళి

కర్నూలు అర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల కోసం సాహూ మహరాజు ఎనలేని కృషిచేశారని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో సాహూ మహరాజు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

నాణ్యమైన విద్య అందించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, మే 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక డీవీఆర్ హోటల్‌లో సంసిద్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్, టాటా క్లాస్ ఎడ్జ్‌తో ఎంవోయూ ఒప్పందం చేసుకున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే దస్తగిరి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కర్నూలుకు జాతీయ స్థాయి విద్యాసంస్థలు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సంసిద్ పాఠ శాల, టాటా క్లాస్ ఎడ్జ్ ఒప్పందం చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంసిద్ విద్యాసంస్థల చైర్మన్ వాసు శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.దీక్షిత్, శివ అనురాగ్, ఎరుకుల హక్కుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వై.కుమార్, క్లస్టర్ మేనేజర్ ఆంజాద్, ప్రిన్సి పాల్ సుజాత సింగసాని, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

భక్తిశ్రద్ధలతో సీతానవమిని నిర్వహించుకోవాలి



రామాయణ పుస్తకాలు అందుకున్న బాలలతో మాళిగి పావని

కర్నూలు కల్చరల్, మే 6(ఆంధ్రజ్యోతి): రామాయణ మహాకావ్యంలో సీతమ్మ జన్మదిన (భూమిలో లభించిన) వేడుక సీతానవమిని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని వీహెచ్‌పీ అనుబంధ మహిళా సంస్థ మాతృశక్తి జిల్ల కోకన్వీనర్ మాళిగి పావని అన్నారు. మంగళవారం సీతా నవమి వేడుక సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా సహ సత్సంగ్ కన్వీనర్ కృష్ణపరమాత్మ ఆధ్వర్యంలో నగరంలో బళ్లారి చౌరస్తా, వైజంక్షన్ సమీపంలోని వాసవీనగర్‌లోగల వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన మాళిగి పావని మాట్లాడుతూ వాల్మీకి మహర్షి శ్రీమద్రామాయణం ద్వారా భగవంతుడు సాధారణ మానవ రూపంలో ఎలా ఆదర్శవంతంగా జీవించాలో తెలియ జేశారని, అలాగే మాతృమూర్తి సీతాదేవి భార్యాభర్తల మధ్య ఎలాంటి అనుబంధం ఉండాలో తెలియజేసిన మహా పతివ్రత అని, ఆమె తన జీవి తాన్ని శ్రీరామునికే అంకితం చేసిందని తెలిపారు. కార్యక్రమంలో బాలలకు రామాయణ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో శారద, హేమలత పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

కర్నూలు కల్చరల్, మే 6(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన రచయిత్రి భాగ్యమ్మ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి 50 పుస్తకాలు వితరణ చేశారు. మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కొనసాగుతున్న బాలల వేసవి పునశ్చరణ శిక్షణ శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ప్రకాశ్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల్లోని 56 శాఖా గ్రంథాలయాల్లో కొనసాగుతున్న ఈ శిక్షణ శిబిరాలకు మంచి స్పందన లభిస్తోందని అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రిసోర్స్ పర్సన్ టీచర్ హాసిని విద్యార్థులకు మెడిటేషన్ చేయించారు. రిసోర్స్ పర్సన్లు కె.గోపాలకృష్ణ, కె. హనుమంతప్ప, రవికుమార్ రెడ్డి, ఉప గ్రంథాలయ అధికారి వి.పెద్దక్క, లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్ బాషా పాల్గొన్నారు.

గుక్కెడు నీటి కోసం పాట్లు

● ఆలూరు మండలం కాత్రికి, కమ్మరచేడు, మూసానహళ్లి గ్రామాల ప్రజల అవస్థలు


సంపు వద్దే దాహం తీర్చుకుంటున్న మహిళ


కాత్రికి సంపులో నుంచి నీరు తోడుకుంటున్న గ్రామస్థులు

ఆలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాత్రికి, కమ్మరచేడు, మూసానహళ్లి గ్రామాల ప్రజలు తాగునీరు అందక ఇబ్బంది పడుతున్నారు. ఈ గ్రామాలకు ఆదోని మండలం నారాయణపురం నీటి పథకం ద్వారా తాగునీరు అందాలి. అయితే పది రోజులుగా నీరు రావడం లేదు. దీంతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు.

సంపు వద్దకు పరుగులు

ఎండాకాలం, తాగునీటి అవసరాలు ఎక్కువగా ఉండటంతో గ్రామస్థులు కాత్రికి సంపు వద్దకు పరుగులు తీస్తున్నారు. ఎద్ల బండ్లు, వాహనాల్లో బిందెలు, డ్రమ్ములు తీసుకుని తాగునీరు తెచ్చు కుంటున్నారు.

● వాల్వ్ బిగిస్తే నేరుగా గ్రామానికే తాగునీరు అందుతుందని అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలని కోరుతున్నారు.

మా కష్టాలు తీర్చేవారే లేరు



తాగునీరు అందక ఇబ్బంది పడుతున్నా మా కష్టాలను తీర్చేవారే లేరు. గుక్కెడు నీటి కోసం అవస్థలు పడుతున్నాం. పది రోజులకోసారి నీరు వస్తే ఎలా తాగాలి. - రంగప్ప, కమ్మరచేడు, ఆలూరు మండలం

కష్టాలు తప్పడం లేదు



తాగునీటి కోసం మాకు కష్టాలు తప్పడం లేదు. ఎన్నికల సమయంలో నాయకులు తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి గెలిచాక కన్నెత్తి చూడలేదు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. - లక్ష్మి, కాత్రికి

రోళ్లపాడు తండాలో..

తుగ్గలి, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రోళ్లపాడు తండాలో తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు. తాగునీరు సక్రమంగా రాకపోవడంతో ఎద్దులబండ్లు, వాహనాల్లో డ్రమ్ములు తీసుకుని పొలాలకు వెళ్లి నీరు తెచ్చుకోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


ఎద్దబండిలో నీరు తెచ్చుకుంటున్న ప్రజలు

ఆలూరులో ఆధార్ కేంద్రం ఏర్పాటు

ఆలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆలూరులో ఆధార్ కేంద్రం లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులపై గత నెల 29న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ఆధార్ కేంద్రాలు ఏవీ?' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఎంపీడీవో మహబూబ్‌బాషా మంగళవారం పట్టణంలోని సచివాలయం-2లో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని వినతి

ఆదోని అగ్రికల్చర్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని బీటీఏ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ కోరారు. మంగళవారం డీఈవో శామ్యూల్ పాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులకు వెకేషన్ డిపార్ట్‌మెంట్ పరిగణించి సెలవులు మంజూరు చేయాలని, ఫెయిల్ అయిన విద్యార్థులకు రెమిడియల్ తరగతులు నిర్వహించాలని ఒత్తిడి చేయడంతో అందోళన చెందుతున్నారన్నారు. ఎండల తీవ్రత దృష్టిలో ఉంచుకొని విద్యార్థులను ఇంటి వద్దే విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని కోరారు. ఈహెచ్ఎస్ మంజూరు చేయాలని డీఏ స్లాట్ లోపాలను సవరించాలని కోరారు.


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న బీటీఏ జిల్లా అధ్యక్షుడు భాస్కర్

బసినేపల్లిలో క్షుద్ర పూజల కలకలం

మద్దికెర, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేపల్లి గ్రామ శివారులో మదనంతపురం రహదారి పక్కన క్షుద్ర పూజలు చేసినట్లు ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ శివారులోని పొలాల్లో రెండు రోజులు క్షుద్ర పూజలు చేశారని, నిమ్మకాయలు, గుమ్మడికాయలు, వివిధ రంగులతో ముగ్గులు వేసి, బింకాయలు, నల్లకోడి రక్తం చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. పోలీసులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


క్షుద్ర పూజలు చేసిన ప్రాంతం

సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

ఆదోని అగ్రికల్చర్, మే 6 (ఆంధ్రజ్యోతి): సమయ పాలన పాటించని 35వ వార్డు అమరావతి నగర్ సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.తిక్కప్ప, పరమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణకు ఫిర్యాదు చేశారు. ఉదయం పదకొండు గంటలైనా సిబ్బంది కార్యాలయానికి రావడం లేదన్నారు. సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలంటే కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కంప్యూటర్లు కూడా పని చేయడం లేదని చర్యలు తీసుకోవాలని కోరారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కేవీపీఎస్ నాయకులు

అపూర్వ కలయిక


తుగ్గలిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

తుగ్గలి, మే 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో చిన్నప్పుడు చదువుకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడానికి 2003 పదో తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1998 నుంచి 2003 వరకు 6 నుంచి పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఉపాధ్యాయులు రామయ్య, ఉస్మాన్ బాషా, ఓబులేసులను సన్మానించారు.

మంత్రిని కలిసిన నాయకులు


సవితను సన్మానిస్తున్న నాయకులు

పత్తికొండ, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి సవితను పత్తికొండ బైపాస్ వద్ద కురువ సంఘం నాయకులు మంగళవారం కలిసి మాట్లాడారు. టిడ్కోల్లెట్ పాల్గొనేందుకు ఎమ్మిగనూరు వెళుతున్న ఆమె పత్తికొండ బైపాస్ వద్ద ఆగారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, బీసీలకు చేతులకు న్యాయం చేస్తున్నామన్నారు. బత్తిన లోకనాథ్, పుండుకూర బ్రహ్మయ్య, సోమలింగమ, పక్కీరప్ప ఉన్నారు.

తాగునీటి ఇబ్బంది రాకుండా చూడాలి


మాట్లాడుతున్న చైర్మన్ ముల్లా మహమ్మద్ గౌస్

ఆదోని టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఇన్‌చార్జి చైర్మన్ ముల్లా మహమ్మద్ గౌస్ సూచించారు. మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేసవిలో శివారు కాలనీ ప్రజలకు తాగునీటి సరఫరా చేయాలన్నారు. తుంగభద్ర నుంచి తాగునీరు విడుదలయ్యే వరకు ఎస్ఎస్ ట్యాంకులోని నీటిని పొదుపుగా వాడాలని, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వీసీ నరసింహులు, కౌన్సిలర్లు వైజీ బాలాజీ, సందీప్ రెడ్డి, మొలకట్ల స్వామి, పయాజ్ భాస్కర్, ఉలిచయాజ్, రామకృష్ణ, డీఈ రామమూర్తి, ఏఈ జనార్దన్ లైన్‌మెన్ వీరేంద్ర పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ వరం

పత్తికొండ, మే 6(ఆంధ్రజ్యోతి): పెరవలి సమీపంలో ఎమ్మెల్యే శ్యాంబాబు భూమి పూజ చేసిన 33కేవీ సబ్ స్టేషన్ రైతులకు వరమని టీడీపీ నాయకులు రాజేశ్ చౌదరి, తిమ్మప్ప అన్నారు. మంగళవారం పత్రికొండలో మాట్లాడుతూ మద్దికెర మండలంలో ఏడు గ్రామాల రైతులు లో వోల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి సీఎం కార్యాలయంతో మాట్లాడి సబ్‌స్టేషన్ మంజూరు చేయించారన్నారు.

వైసీపీ కార్యవర్గ సభ్యుడిగా బాలచంద్ర



మద్దికెర, మే 6 (ఆంధ్రజ్యోతి): గ్రామానికి చెందిన పంచాయతీ సభ్యుడు గడ్డం బాలచంద్రను వైఎస్సార్సీపీ కార్యవర్గ సభ్యుడిగా నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్ మంగళవారం తెలిపారు. అధినేత వైఎస్ జగన్, జిల్లా అ.ధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవికి బాలచంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సాయం

ఆదోని రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన బొంపల్లి నరసింహులు మంగళవారం మృతి చెందారు. వైసీపీ నాయకుడు, కాంట్రాక్టర్ బసవరాజు కుటుంబాన్ని పరామర్శించి, రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


వెల్దుర్తిలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

వెల్దుర్తి, మే 6(ఆంధ్రజ్యోతి): బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సీడీపీవో లూక్ సూచించారు. మంగళవారం వెల్దుర్తిలో కిశోరి వికాసం నిర్వహించారు. సచివాలయం-2 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలైన 3,4,5,11 సెంటర్లలో బాలికలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేసేవారి సమాచారాన్ని 1098, 100 నెంబర్లకు తెలియజేయాలన్నారు. అంగన్వాడీలు సరస్వతి, ఈదమ్మ, రామలక్ష్మమ్మ, మాబున్ని తదితరులు పాల్గొన్నారు.

బాలికలు జాగ్రత్తలు పాటించాలి

తుగ్గలి, మే 6 (ఆంధ్రజ్యోతి): కిశోరి బాలికలు జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆంటిక సూచించారు. మంగళవారం పెండేకల్ సచివాలయంలో బాలికలకు అవగాహన కల్పించారు. యుక్త వయసు పిల్లలు శరీరంలోతో పాటు సమాజంలోని మార్పులపై అవగాహన ఉండాలన్నారు. పరిశుభ్రతను పాటించాలని, సమస్యలుంటే తమ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ

మద్దికెర, మే 6 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ విజయకుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని పెరవలి గ్రామంలో గృహాలను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ స్థాయిలో గృహాలను నిర్మిస్తున్న లబ్ధిదారులు వెంటనే పూర్తి చేసుకోవాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లబ్ధిదారులకు రూ.2.30 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు ఖాతాల్లో నగదు జమ అవుతాయని అన్నారు. లబ్ధిదారులు దళారులను ఆశ్రయించ వద్దని సూచించారు. మండలంలో నూతన గృహాలు మంజూరుకు వివిధ దశల దరఖాస్తు చేసుకోవాలని, మంజూరైన వెంటనే జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ ఉమాకాంత్ ఉన్నారు.

క్రీడాకారులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం


క్రీడాకారులకు సాయం అందజేస్తున్న సాంబశివారెడ్డి

పత్తికొండ, మే 6(ఆంధ్రజ్యోతి): అండర్-19 క్రికెట్ టెన్నిస్‌బాల్ జాతీయ జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు ఎమ్మెల్యే శ్యాంబాబు ఆర్థిక సాయం అందించారు. గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో గతనెల టోర్నమెంట్‌లో పత్తికొండకు చెందిన ఐలియాజ్‌బాషా, రసూల్, ముఖేశ్ ప్రతిభ చూపి జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. ఈనెల 9,10,11 తేదీల్లో నాగపూర్‌లో నేషనల్ టోర్నమెంట్‌లో ఆడనున్నారు. నాయకులు సాంబశివారెడ్డి మంగళవారం నగదును క్రీడాకారులకు అందజేశారు.

రైతులను బెదిరిస్తే కఠిన చర్యలు

దేవనకొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): రైతులను బెదిరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్ హెచ్చరించారు. తమను రెవెన్యూ అధికారులు బెదిరించినట్లు కరిడికొండ గ్రామ రైతులు సోమవారం కర్నూలులో కలెక్టరుకు ఫిర్యాదు చేయడంతో ఆయన తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేశారు. రైతులు మాట్లాడుతూ కరిడికొండ ముల రెవిన్యూ సర్వే నెం.807లో పది ఎకరాల్లో క్వారీ ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ అధికారులు క్వారీ యజమానులకు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని, అలాగే కరిడికొండ సర్పంచ్ సైతం క్వారీకి అనుకూలంగా తీర్మానం ఇచ్చినట్లు ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆర్డీవో పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పల్లెదొడ్డి, తెర్నేకల్లు, బండపల్లి, నెల్లిబండ, గ్రామాల పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆర్డీవో తనిఖీ చేశారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి

ఆదోని రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): క్షయ నిర్మూలనకు కృషి చేయాలని పెద్దహరివాణం వైద్యాధికారి ఇమాన్ కోరారు. మంగళవారం పీహెచ్‌సీలో బాధితులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఎంపీహెచ్ఈవో లక్ష్మీ నారాయణ, ఎంపీహెచ్ఎస్ బాబురాజు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ తీర్మానం ఇవ్వండి

వెల్దుర్తి, మే 6 (ఆంధ్రజ్యోతి): జ్యోతిబా పూలే పాఠశాలకు సొంత నిర్మాణానికి గ్రామసభ తీర్మానం ఇవ్వాలని టీడీపీ కన్వీనర్ బలరాంగౌడ్ డీపీవో భాస్కర్‌కు మంగళవారం కర్నూలులో వినతిపత్రం అందజేశారు. అద్దెభవనంలో కొనసాగుతున్న పాఠశాలకు సొంతభవనం నిర్మించడానికి ఎమ్మెల్యే శ్యాంబాబు సహకారంతో వెల్దుర్తిలో సర్వే నెం. 1221-1, 1221-2లో 12 ఎకరాల స్థలాన్నికేటాయించామన్నారు. సర్పంచ్ వైసీపీ మద్దతుదారుడు కావడంతో గ్రామసభ తీర్మానం ఇవ్వడం లేదన్నారు. స్పందించిన డీపీవో ఫోన్‌చేసి వివరాలు తెలుసుకున్నారు. గ్రామసభ ఏర్పాటుచేసి కొరంతో తీర్మానాన్ని పంపాలని అధికారులను ఆదేశించారు. రామకృష్ణకోట రామకృష్ణారావు, గుంటుపల్లి ఈడుల వెంకటరాముడు, వెల్దుర్తి రామచంద్ర ఉన్నారు.

చర్యలు తీసుకోవాలి

ఆదోని అగ్రికల్చర్, మే 6 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు పూర్తికాకముందే అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డివిజన్ ప్రధాన కార్యదర్శి దస్తగిరి డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో కార్యకర్తల నిర్వహించారు. యూనిఫాం, పుస్తకాలు, ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. రవి, నాని, తరుణ్, వరుణ్ తేజ్ పాల్గొన్నారు.

జీవో రద్దు చేయాలి

ఆదోని అగ్రికల్చర్, మే 6 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 77ను రద్దుచేసి పీజీ నిర్వహించాలని ఏబీవీపీ కన్వీనర్ వీరేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ జీవో నెం. 77తో పేద విద్యార్థులు ప్రైవేటు కళాశాలల్లో పీజీ విద్యను అభ్యసించలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో లోకేష్ ఇచ్చిన హామీ మేరకు జీవోను రద్దు చేయాలన్నారు.

వైద్య కళాశాల పనులు ప్రారంభించండి


ఆరేకల్లు గ్రామంలో పర్యటిస్తున్న మంత్రి సవిత

ఆదోని రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరేకల్లు సమీపంలో ఆగిపోయిన మెడికల్ కాలేజీ పనులను ప్రారంభించాలని కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, ఆరేకల్లు రామకృష్ణ, నలకలదొడ్డి ప్రతాప్‌రెడ్డి, అలసందగుత్తి రామకృష్ణ కోరారు. మంగళవారం రాత్రి మంత్రి ఆరేకల్లులోని రామకృష్ణ గృహంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. తమ గోడును మంత్రి లోకేష్‌కు విన్నవించాలని కోరారు. స్పందించిన మంత్రి సమస్యను లోకేష్‌కు తెలిపి పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

మద్దికెర, మే 6 (ఆంధ్రజ్యోతి): కిశోరి బాలికల సంరక్షణ మన బాధ్యత అని ఐసీడీఎస్ సీడీపీవో లలిత, ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి సూచించారు. మంగళవారం మండలంలోని మద్దికెర, పెరవలి, బసినేపల్లి గ్రామాల్లో కిశోరి వికాసం వేసవి ప్రత్యేక సదస్సు నిర్వహించారు. జూన్ 10వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తామని, కిశోరి వికాసంపై గ్రామసాథయి కమిటీలు కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించాలని, చిన్న వయసులోనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేయవద్దని అన్నారు. సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ అక్తర్ బాషా, నిరంజన్‌బాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఆదోని టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని మైనారిటీ కాలనీకి తాగునీరందించే పైపులైన్ కంట్రోలింగ్ వద్ద పగిలిపోవడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. వార్డు కౌన్సిలర్ వయాజ్ అహమ్మద్ వెంటనే స్పందించి మున్సిపల్ నీటి విభాగంపు అధికారులు, సిబ్బందిని రప్పించి దగ్గరుండి మరమ్మతులు చేయించారు. తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. కాలనీ వాసులు కౌన్సిలర్, సిబ్బందిని అభినందించారు.

కౌలు రైతుల వివరాలు సేకరించండి

దేవనకొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలు రైతుల వివరాలు సేకరించాలని ఏవో సురేష్‌బాబు సిబ్బందిని ఆదేశించారు. అన్నదాత సుఖీభవకు రైతుల వివరాలను ఈ నెల 15 లోగా నమోదు చేయాలన్నారు. భూసార పరీక్షలకు మట్టి నమూనాలను సేకరించాలని సూచించారు.

సబ్ కెనాల్ ఏర్పాటు చేయాలి


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

దేవనకొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని గుండ్లకొండ నుంచి పి.కోటకొండ వరకు హంద్రీనీవా సబ్ కెనాల్ ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. హంద్రీనీవా ద్వారా సగం మండలానికే నీరందుతోందని, గుండ్లకొండ వద్ద ప్రధాన కాలువకు స్లూయిజ్ ఏర్పాటు చేస్తే దాదాపు 10 గ్రామాలకు సాగు, తాగు నీరు అందే అవకాశం ఉందన్నారు. సీపీఐ మండల కార్యదర్శి నర్సారావ్, శ్రీరాములు, తిమ్మప్ప, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ స్థలాలను గుర్తిస్తున్నాం : ఆర్డీవో


ఆన్‌లైన్‌లో వివరాలను పరిశీలిస్తున్న ఆర్డీవో

మద్దికెర, మే 6 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని అన్ని మండలాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తిస్తున్నామని ఆర్డీవో భరత్ నాయక్ అన్నారు. మంగళవారం పెరవలి గ్రామంలో ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. అనంతరం సచివాలయంలో రీసర్వే ఆన్‌లైన్ వివరాలను పరిశీలించారు. రీసర్వే వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రైతులు రీసర్వేకు సహకరించాలన్నారు. వీఆర్వోలు గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందించాలన్నారు. తహసీల్దార్ హుసేన్ సాహెబ్, సర్వేయర్ నరేంద్ర, వీఆర్వోలు ఉన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

ఆదోని అగ్రికల్చర్, మే 6 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యంగల గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని ఒకటో పట్టణ సీఐ శ్రీరాములు అన్నారు. మంగళవారం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, పిలిప్స్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ సీవ ప్రారంభించారు. కబడ్డీ అంటేనే ఆదోని అని, మంచి క్రీడాకారులు ఎదిగి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని సూచించారు. కోచ్ అమర్ ప్రకాష్, అరుణ్ జ్యోతి నగర్ కబడ్డీ టీం సీనియర్ జూనియర్ క్రీడాకారులు నాగరాజు, దుబ్బు, ఎల్లప్ప వర్కప్ప, చిన్న, సుమా, హారతి, శృతి, వరలక్ష్మి, ప్రావణి పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేయవద్దు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● ఆదోని డిప్యూటీ ఎంపీడీవో జనార్దన్



ఆదోని రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తాగునీటిని వృథా చేయవద్దని, వేసవి సందర్భంగా పొదుపుగా వాడాలని డిప్యూటీ ఎంపీడీవో జనార్దన్ సూచించారు.

ప్రశ్న: గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయడం లేదని ఫిర్యాదు ఉన్నాయి?

జవాబు: గ్రామాల్లో కాల్వల్లో పూడిక తీయిస్తున్నాం. వారానికోసారి ఫాగింగ్ దోమల మందు పిచికారీ చేయిస్తున్నాం.

ప్రశ్న: తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారా?

జవాబు: నీటిబుడ్డి, పెద్దతుంబళం, పెద్దహరివాణం స్కీం ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నాం. సమస్య ఉన్న చోట ట్యాంకర్ల ద్వారా అందిస్తాం.

ప్రశ్న: వేతింపులకు మరమ్మతులు చేయించారా?

జవాబు: గ్రామాల్లో బోర్లు పనిచేయలేదని ప్రజలు ఫిర్యాదు చేస్తే 24 గంటల్లో మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తాం.

ప్రశ్న: పంచాయతీ కార్యదర్శులు విధులకు గైర్హాజరవుతున్నారని ఫిర్యాదులు అందినా చర్యలు తీసుకోవడం లేదంటున్నారు?

జవాబు: పంచాయతీ కార్యదర్శులు వారికి కేటాయించిన గ్రామాలకు వెళ్ళాల్సిందే. ఫిర్యాదులు వస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

ప్రశ్న: ఇంటి పన్నుల వసూళ్ల ఎంతవరకు వచ్చాయి?

జవాబు: మండలంలోని 44 గ్రామాల్లో పన్నుల వసూలు చేస్తున్నాం. ఇప్పటికే 90 శాతం పూర్తయింది. మిగిలిన 10 శాతం కూడా వసూలు చేస్తాం.

అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్న వైసీపీ

ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ● రాష్ట్ర మంత్రులతో కలిసి టెక్స్‌టైల్ పార్క్‌కు భూమి పూజ

ఎమ్మిగనూరు రూరల్, మే6(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిని చూసి వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బనవాసిలో మెగా టెక్స్ టైల్ పార్కుకు రాష్ట్ర మంత్రులతో కలిసి భూమి పూజచేసి శిలాఫల కాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బనవాసిలో చేనేతల కోసం మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుచేస్తుంటే వైసీపీ నాయకులకు నిద్ర రావడం లేదన్నారు. టెక్స్‌టైల్ పార్కుకు నాంది పలికింది తనతండ్రి దివంగత నేత బీవీ మోహన్‌రెడ్డి అన్నారు. యువగళంలో మంత్రి నారాలోకేశ్ చేనేతలకు ఇచ్చిన హామీ మేరకు 11 నెలల్లోనే ఎమ్మిగనూరులో మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేశారన్నారు. కొన్నేళ్లుగా గుంత మగ్గాల్లో వస్త్రాలను నేస్తూ ఇబ్బందులు పడేవారికి ఇక అవస్థలు ఉండవన్నారు. 2004లో తనతండ్రి బీవీ మోహన్‌రెడ్డి అపెరల్ పార్కు తీసుకువస్తే తర్వాత వచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దాన్ని పులివెందులకు తరలించుకుపోయాడని ఆరోపించారు. అలాగే 2014లో ఇక్కడే చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో టెక్స్‌టైల్ పార్కుకు స్థలం కేటాయించడం జరిగిందన్నారు. అయితే ఆటు తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ చేనేతలపై కక్షకట్టి వేల మందికి ఉపాధికి ఉపయోగపడే పార్కుకు కేటాయించిన స్థలంలో ఇళ్ల పట్టాలు ఇచ్చి తన కుటిల బుద్ధిని చాటుకున్నారని విమర్శించారు. టెక్స్‌టైల్ పార్కులో రూ.20కోట్లలో లేటెస్టు డిజైన్‌లు, స్టడీటూర్లు,


రాష్ట్ర మంత్రులతో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

నైపుణ్య శిక్షణ వంటివి ఇస్తామన్నారు. పగన్‌ప్లే విధానంలో చేనేతలు ఇంటి నుంచే పనులు చేసుకునేవిధంగా అవకాశం ఉంటుందన్నారు. వైడబ్ల్యూసీఎస్‌లో చాలా అవినీతి జరిగిందని, దానిపై దృష్టి పెట్టాలని మంత్రి సవితని కోరారు. అంతకుముందు కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అభివృద్ధి అంటే చంద్రబాబు అని, వినాశకారి అంటే వైఎస్ జగన్ అని అన్నారు. ఇక జన్మలో కూడా జగన్ ముఖ్యమంత్రి కాలేరన్నారు. కర్నూలును నెంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు పరిశ్రమల శాఖా మంత్రి కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తండ్రిని మించిన తనయుడని కితాబిచ్చారు.

చేనేతలు ఉన్నతస్థానానికి ఎదగాలి

మెగా టెక్స్‌టైల్ పార్కులో ఉపాధి పొంది చేనేతలు ఉన్నత స్థానానికి ఎదగాలని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర ప్రభు త్వం చేనేతల కోసం ఏర్పాటు చేస్తున్నా గత ప్రభుత్వం కావాలనే చేనేతల స్థలంలో పట్టాలు ఇచ్చి నాశనం చేసేందుకు ప్రయత్నించిందని, అయితే ఎమ్మెల్యే పట్టుబట్టి ఆ స్థలంలో పార్కు ఏర్పాటు చేసేందుకు కృషిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ చేనేత నాయకులు నాగరాజు, మిన్నప్ప, మహేష్, దేవేంద్ర, భీమేష్, నాయకులు రామకృష్ణనాయుడు, మహేంద్రబాబు, గురురాజాదేశాయ్, బండె గురుస్వామి, మాజీ ఎంపీపీ వాల్మీకి శంకరయ్య, మల్లికార్జున, సోమేశ్వ రరెడ్డి, బోడబండ సురేష్, కురువ మల్లయ్య, నరసన్నగౌడు, సోగనూరు జగదీష్, రాఘవేంద్ర, కె.టి వెంకటేశ్వర్లు, నంబూరి సురేష్‌చౌదరి, కొండన్నగౌడు, శంకర్‌గౌడు, తిమ్మరాజు, నజీర్, డీలర్ ఈరన్న, కందనాతి కేశన్న, బాబు, దేవదాసు, రాముడు పాల్గొన్నారు.

'సమ్మె విజయవంతం చేయండి'


మెడికల్ ఆఫీసర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆశా వర్కర్లు

కోసిగి, మే 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20వ తేదీన కార్మిక చట్టాలను కాపాడాలని కోరుతూ దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు అన్నారు. మంగళవారం కోసిగి ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్ కుమార్‌కు ఆశా వర్కర్లు వెంకటమ్మ, సుజాత, లక్ష్మి, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో లేబర్ కోడ్లను రద్దు చేసి కార్మిక చట్టాలను కాపాడాలని కోరుతూ ఈనెల 20న దేశ వ్యాప్త సమ్మె జరుగుతుందని, ఈ సమ్మెలో మండలంలోని ఆశావర్కర్లు అందరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, వీరేష్ తదితరులు ఉన్నారు.

ఎమ్మార్సీ భవనానికి చేరిన పాఠ్యపుస్తకాలు


ఎమ్మార్సీకి చేరిన పాఠ్య పుస్తకాలతో ఎంఈఓ శోభారాణి

కౌతాళం, మే 6(ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం 2025-26 సంవత్సరానికి సంబంధించిన 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను అందించేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సెమీస్టర్-1కు సంబందించిన 33,077ల పుస్తకాలు మంగళవారం వచ్చినట్లు ఎంఈఓ-2 శోభారాణి తెలిపారు. వీటిని ఆయా పాఠశాలలకు త్వరలో పంపిణీ చేసి పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు అందజేస్తామని పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థులకు అందేలా చేస్తామన్నారు. ఈ సమావేశంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అగ్రహారంలో తాగునీటి సమస్య


ట్యాంకర్ల దగ్గర నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

గోనెగండ్ల, మే 6(ఆంధ్రజ్యోతి): అగ్రహారం గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రమైంది. అధికారులు నాలుగు ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నారు. అయితే ఆ నీరు ఎంతమాత్రం సరిపోవడం లేదని గ్రామస్థులు తెలుపుతున్నారు. గ్రామానికి తాగునీరు అందించే బోర్లకు నీరు అందక పోవడంతో నీటికష్టాలు మొదలయ్యాయి. గ్రామంలోని బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలతో పాటు పలు కాలనీలలో తాగునీటి సమస్య తీవ్రమైంది. నీటి సమస్య కారణంగా గ్రామానికి 2కిలోమీటర్ల దూరంలో ఉన్న బావులు, బోర్ల నుంచి నీటిని దొబ్బుడు బండ్లపై బిందెలతో నీటిని తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన నీటి ట్యాంకర్లు గ్రామస్థులకు ఎంత మాత్రం సరిపోవడం లేదని మరిన్ని ట్యాంకులను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బ్యాంకు రుణాల కోసం రైతుల పాట్లు

మంత్రాలయం, మే 6 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో రైతులు బ్యాంకుల వద్ద రుణాలు తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. తమ భూములకు చెందిన ఆన్‌లైన్ అడంగల్, 1బీలు రాక తహసీల్దార్ కార్యాలయం చుట్టూ రైతులు చెప్పులరిగేలా తిరుగుతున్నారు. గత పదిహేను రోజుల నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు, కెనరా బ్యాంకు, బ్యాంకాఫ్ బరోడా.. స్టేట్‌బ్యాంకులో ఖరీప్ పంట సాగు కోసం కొత్త రుణాలు తీసుకోవడం, ఉన్న అప్పులను కట్టి రెన్యువల్ చేసుకునేందుకు రైతులు బ్యాంకులను ఆశ్రయిస్తున్నారు. అయితే.. కంప్యూటర్‌లో ఆన్‌లైన్ అడంగల్, 1బీ రికార్డులు రావడం లేదని రైతులు వాపోతున్నారు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా వెబ్‌సైట్ సమస్యతో రావడం లేదని మీ భూమిలో పొందుపరిచిన తెల్లకాగితంపైనే వీఆర్వో సంతకాలు చేసి బ్యాంకుకు వెళ్లాలని చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి పట్టాదారు పాసుపుస్తకంలో ఉన్న విస్తీర్ణానికి ఆన్‌లైన్, 1బీ కంప్యూటరీకరణ పత్రాలను ఇచ్చేందుకు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

కొత్తి మీర ధరకు రెక్కలు


విస్తారంగా కొత్తిమీర సాగు

గోనెగండ్ల, మే 6(ఆంధ్రజ్యోతి): కొత్తిమీర ధర ఆకాశాన్నంటుతోంది. రెండు రోజుల నుంచి కొత్తి మీర మడి ధర రూ.వెయ్యి నుంచి రూ.1,200 వరక పలుకుతోంది. దీంతో కొత్తి మీర పంటను సాగు చేసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు మాత్రం ఈ ధరలను చూసి బెంబేలెత్తిపోతున్నారు. ఎండలు అధికం కావడంతో బోర్లు, బావుల దగ్గర నీరు ఎండిపోవడం, మరోవైపు పెళ్లిళ్ల సీజన్ కావడంతో కొత్తిమీర ధర పెరిగింది. గోనెగండ్ల మండలంలో ప్రస్తుతం బావులు, బోర్ల దగ్గర దాదాపు 1,500 ఎకరాలలో కొత్తిమీర పంటను సాగుచేశారు. మండు టెండలకు దాదాపు 500 ఎకరాల్లో కొత్తిమీర పంట ఎండిపోయింది. మిగతా వెయ్యి ఎకరాల్లో పంట సాగు అయింది. ఏదిఏమైన ప్రస్తుతం కొత్తి మీర పంట సాగు చేసుకున్న రైతులు మాత్రం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇవి తాగునీరేనా?


అపరిశుభ్రంగా ఉన్న తాగునీరు

ఎమ్మిగనూరు టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని గుడికల్ రోడ్డున ఉండే వాటర్ పంప్ హౌస్ నుంచి పట్టణ ప్రజలకు తాగునీరు సప్లయ్ అవుతోంది. అలాంటి తాగునీరు అందించే పంప్ హౌస్‌లో అపరిశుభ్రత నెలకొంది, శుభ్రత పాటించడం లేదు. పదిహేను రోజులకు ఒక సారి ఫిల్టర్ శుభ్రం చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. సంబంధిత అధికారులు, సిబ్బంది పంప్ హౌస్‌లో శుభ్రత పాటించి క్యారి ఫ్లకలేటర్, ఫిల్టర్ బెడ్‌లను శుభ్రం చేసి పట్టణ ప్రజలకు శుద్ధిచేసిన తాగునీరు అందించాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

రేపు జాబ్ మేళా


జాబ్ మేళా పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 8వ తేదీన జాబ్ మేళా నిర్వహినట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా అధికారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో 13కు పైగా బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. పదో తరగతి నుంచి ఏదైనా డిగ్రీ, బీటెక్, పీజీ చదివి, 18-35 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన నిరుద్యోగ యువకులు ఇందుకు అర్హులన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డు, బయోడేటా, రెండు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. వివరాల కోసం 7799494856, 9642735717, 8885904099 సెల్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, ప్లేస్‌మెంట్ అధికారి సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిని చేరదీసిన పూలే అంబేద్కర్ సొసైటీ


మహ్మద్ అలీకి పండ్లు అందిస్తున్న సింగనేటి నరసన్న

ఎమ్మిగనూరు టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : షైనార్టి కాలనీకి చెందిన మహ్మద్ అలీ (81)సంవత్సరాల వృద్ధుడు కొన్ని రోజుల క్రితం సైకిల్ తొక్కుతూ లారీని తప్పించబోయి కింద పడడంతో తొడలోపల ఎముక విరిగి అనారోగ్యానికి గురైనా కుటుంబ సభ్యులు పట్టించుకోక పోవడంతో కాలనీవాసులు పూలే అంబేద్కర్ సొసైటీ నరసన్నకు సమాచారం ఇవ్వగా ప్రతిభా భారతి, మహిళా చైతన్య వేదిక అధ్యక్షురాలు సునీతలు వృద్ధుడికి వైద్యం అందించి చేరదీసినట్లు తెలిపారు. సొసైటీ వారు ఎమ్మిగనూరు టౌన్‌లో దిక్కులేని వృద్ధులను చేరదీసి వారి బాగోగులు చూసుకుంటూ, అనాథలుగా చనిపోయిన వారికి అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు.

చేనేతల్లో వెల్లివిరిసిన ఆనందం

● భారీగా తరలివచ్చిన జనం

ఎమ్మిగనూరు రూరల్, మే6(ఆంధ్రజ్యోతి): చేనేతలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న చేనేత టెక్స్‌టైల్ పార్కు బనవాసిలో ఏర్పాటు కానుండడంతో చేనేతల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. 77 ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర మంత్రులు సవిత, టీజీ భరత్, ఎన్ఎండీ ఫారుక్‌తో పాటు ఎమ్మెల్యే పార్థసారధి హాజరై భూమి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మిగనూరు పట్టణం, నందవరం, గుడికల్లు, గోనెగండ్ల, నాగలదిన్నె తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా చేనేత కళాకారులు, చేనేత కార్మికులు తరలివచ్చారు. ఈ బృహత్కర కార్యక్రమాన్ని తిలకించేందుకు ఎమ్మిగనూరు, ఎమ్మిగనూరు మండలంలోని ఆయా గ్రామాల నుంచే గాక మంత్రాలయం, ఆదోని, కోడుమూరు నియోజకవర్గాల నుంచి జనం తరలివచ్చారు. ఈ సందర్భంగా చేనేత కళాకారులు, చేనేత కార్మికులు రాష్ట్ర మంత్రులను నూలుపోగులు, టోపీలతో ఘనంగా సన్మానించారు. అలాగే చేనేత నాయకులు గజమాలతో సన్మానించగా, కురుబ నాయకులు కంబడితో చేనేత జౌళీశాఖా మంత్రి సవితను సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు సొసైటీ ఆధ్వర్యంలో సభ దగ్గర ఏర్పాటుచేసిన మొబైల్ స్టాల్‌లో చేనేతవస్త్రాలను మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు పరిశీలించి కొనుగోలు చేశారు. ఎండ తాండవం చేస్తున్నా కార్యక్రమానికి హాజరైన జనం కదలకుండా కార్యక్రమం పూర్తయ్యే వరకు ఉండడంతో మంత్రులు కూడా ఆశ్చర్యపోయారు.


గజమాలతో మంత్రులను సన్మానించిన టీడీపీ నాయకులు

టెక్స్‌టైల్ పార్కు ప్రారంభం హర్షణీయం


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, మే6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి ఫారం సమీపంలో మెగా టెక్స్‌టైల్ పార్కుకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మంత్రులు టీజీ భరత్, సవిత, ఎన్ఎండీ ఫారుక్ భూమి పూజ చేయడం హర్షణీయమని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న అన్నారు. చేనేతలకు ఎంతగానో ఉపయోగపడే టెక్స్‌టైల్ పార్కుకు భూమి పూజ చేయడంతో చేనేతల కళల్లో ఆనందం కనిపించిందని ఆయన అన్నారు. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే టెక్స్‌టైల్ పార్కును ఏడాదిలోపు పూర్తి చేస్తే చేనేతలు సంతోషిస్తారన్నారు. సమావేశంలో నాయకులు భాస్కర్‌యాదవ్, దాదావలి, మల్లికార్జునగౌడు, ఖాజా, నరసింహులు పాల్గొన్నారు.

హామీ నిలబెట్టుకున్న లోకేశ్


1100 కిలోమీటర్లు పాదయాత్ర చేసిన సందర్భంగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేస్తామని శిలాఫలకంను ప్రారంభిస్తున్న లోకేశ్ (ఫైల్)

గోనెగండ్ల, మే 6(ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్ర సందర్భంగా గోనెగండ్లలో కార్యకర్తలకు, చేనేతలకు, ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు మంగళవారం మంత్రులచే భూమి పూజ చేయించి మంత్రి నారా లోకేశ్ మాట నిలబెట్టుకున్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో గత రెండేళ్ల క్రితం ప్రస్తుత ఐటీ, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ యువగళం పాదయాత్ర చేపట్టారు. అందులో భాగంగా మే 1తేదీ 2023న యువగళం పాదయాత్ర గోనెగండ్ల గ్రామ శివార్లకు చేరుకోగానే 1100 కిలోమీటర్ల చేరుకుంది. దీంతో అక్కడ ఒక స్థూపం ఏర్పాటు చేసి నియోజకవర్గ ప్రజలతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే చేనేతల కోసం టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేస్తామని నారాలోకేష్ హామీ ఇచ్చారు. హామీ ఇచ్చిన ప్రకారం రెండు సంవత్సరాల ఐదు రోజులకు ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్క్‌కు భూమి పూజ టీడీపీ మంత్రులతో చేయించి తన మాట నిలబెట్టుకున్నాడని టీడీపీ నాయకులు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కృషి ఉందని చేనేత కార్మికులు పేర్కొంటున్నారు.

తప్పిన పెను ప్రమాదం


రెడియేటర్‌కు నీరు పోసి చల్లార్చుతున్న దృశ్యం

గోనెగండ్ల, మే 6(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల బస్టాండ్‌లో కర్నూలు 2 డిపోకు చెందిన బస్సులో రేడియేటర్ విపరీతంగా వేడెక్కి పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళలన చెందారు. దీన్ని గుర్తించిన డ్రైవర్ చాకచక్యంగా బస్సును నిలిపి ప్రమాదం తప్పించాడు. మంగళవారం మధ్యాహ్నం కర్నూలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కర్నూలు నుంచి ఆదోనికి బయలుదేరి గోనెగండ్ల బస్టాండ్ కు చేరుకోగానే బానెట్ నుంచి పెద్దగా పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళలనకు గురయ్యారు. ప్రమాదాన్ని గుర్తించిన డ్రైవర్ బస్సు ఇంజన్ ఆపేశాడు. బస్సు కండెక్టర్ ప్రయాణికులను వేరే బస్సు ఎక్కించారు. డ్రైవర్ చాకచక్యంతో ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు.

మంచాలమ్మకు పుష్పాలంకరణ


మంచాలమ్మ దేవిని అలంకరించిన దృశ్యం

మంత్రాలయం, మే 6 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య గ్రామ దేవత మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. వైశాఖ నవమి మంగళవారం పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలతో పాటు, పుష్పార్చణ, కుంకుమ సేవ, ఆకుపూజ, విశేష పంచామృతాభిషేకం చేశారు. బంగారు, వెండి, పట్టుచీరలతో అమ్మవారికి అలంకరణ చేశారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పీఠాధిపతి మహా మంగళహారతులు ఇచ్చి భక్తులను ఆశీర్వదించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రమణీయం.. ప్రహ్లాదరాయల చెక్క రథోత్సవం

మంత్రాలయం, మే 6 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు చెక్క రథంపై విహరించారు. వైశాఖ నవమి మంగళవారం శుభదినాన్ని పురస్కరించుకుని బృందావనానికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలుచేసి హారతులు ఇచ్చారు. ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలకు పాదపూజ చేసి చెక్క పల్లకిలో ఊరేగించిన అనంతరం స్వామివారిని రథంపై అధిష్టించి ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల సేవ నిర్వహించి భక్తులకు శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

శ్రీ మఠానికి రెండు వెండి దీపాలు విరాళం

రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరు చెందిన సీతాలక్ష్మి అనే భక్తురాలు 1.400 కేజీల వెండితో తయారు చేసిన రెండు వెండి దీపాలను విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏవో మాదవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేష్ జోషీ, సురేష్ కోనాపూర్‌లు తెలిపారు. మంగళవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్రస్వామిని దర్శించుకుని 1.400 కేజీలతో ఆకర్షణీయంగా రూపొందించిన వెండి దీపాలను విరాళంగా ఇచ్చారని తెలిపారు. వీరికి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శేషవస్త్రం, మెమెంటో, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో అనంతపురాణిక్, శ్రీపాదాచార్, సుజ్ఞానేంద్రాచార్‌లు భక్తులు పాల్గొన్నారు.


విహరిస్తున్న ప్రహ్లాదరాయలు